ఈనాటి

# తెలుగోడు

PRGI-NO-APTEL/25/A2739

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 96 | ఆదివారం 4 జనవరి, 2026 | పేజీలు - 8 వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati




## గంజాయితో దొరికితే

# శిక్ష తప్పదు

### హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరిక



**శ్రీకాకుళం (తెలుగోడు), జనవరి 3 :**

గంజాయి కేసుల్లో దొరికితే శిక్షలు కఠినంగా ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. చిన్న చిన్న సరదాలకు పిల్లల జీవితాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. శనివారం శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురంలో అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సభకు హోంమంత్రి అనిత, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. 501 గ్రామాలు, సుమారు 1300 కిలోమీటర్ల మేర పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయ సైకిల్ యాత్ర జరిగిందని తెలిపారు. ఇటీవల ఇండిగో సంక్షోభాన్ని హ్యాండిల్ చేయలేదని రామ్మోహన్ నాయుడుపై ఆరోపణలు (మిగతా 2లో)


## అమరావతిలో పూర్తి కావచ్చిన ప్రముఖుల

# నివాసాలు



**అమరావతి (తెలుగోడు), జనవరి 3 :**

అమరావతి క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల నివాస భవనాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. నివాస భవనాల పనులు ఈ ఏప్రిల్‌లో పూర్తి చేసి హ్యాండ్ ఓవర్ చేయనున్నట్లు తెలిపారు. అమరావతిలో మొత్తం 4,026 భవనాలు, ఫ్లాట్లు నిర్మించబడుతున్నాయని చెప్పారు. వీటిలో 186 బంగ్లాలు ఉండగా, మిగతా 3,850 భవనాలు అపార్ట్‌మెంట్ మోడల్లో నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా రావడం వల్ల కొన్ని పనులు ఆలస్యం అయ్యాయని, అయితే ఇప్పుడు అన్ని నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మంత్రుల బంగ్లాలు చాలా వరకు పూర్తయ్యాయన్నారు. జడ్జీల బంగ్లాల్లో బ్రిక్ వర్క్, ప్లాస్టింగ్ తుది దశకు చేరిందని.. (మిగతా 2లో)




పెట్టుబడుల సాధనపై ఫుల్ ఫోకస్..

దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25శాతం ఆంధ్రప్రదేశ్‌కే..

ప్రపంచంలోనే ప్రముఖ మ్యాగజైన్ ఫోర్బ్స్ కథనంపై చంద్రబాబు ఫుల్ ఖుష్..

## పెట్టుబడుల ఆకర్షణలో

# అగ్రగామి

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సారధ్యం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి పెట్టుబడులపై ఫుల్ ఫోకస్ చేసింది. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని రాష్ట్ర ప్రగతి కోసం ఉపయోగపడేలా చంద్రబాబునాయుడు శ్రమిస్తూనే వున్నారు. ఈ సందర్భంగానే రాష్ట్రంలో పెట్టుబడులు అధికంగా వచ్చాయి. ముఖ్యంగా ఇది 2026 ప్రారంభానికి అద్భుతమై ఉత్సాహం ఇచ్చింది. ఈ విషయాన్నే ప్రపంచంలోనే ప్రముఖ మ్యాగజైన్ ఫోర్బ్స్ తన బిజినెస్ ఎడిషన్ లో ప్రచురించింది.

**అమరావతి (తెలుగోడు), జనవరి 3 :**

2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడులను భారీగా ఆకర్షించింది. 2025 ఏప్రిల్-డిసెంబర్ వరకు భారతదేశ వ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీనే రాబట్టుకోవడం గమనార్హం. ఈ మేరకు ఫోర్బ్స్ బిజినెస్ మేగజైన్ ఓ కథనం వెలువరించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ డేటా ఆధారంగా బ్యాంక్ ఆఫ్ బరోడా తన ఆర్థిక నివేదికలో పలు విషయాలు వెల్లడించింది. ఈ విషయాలన్నీ సీఎం చంద్రబాబు తన సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకున్నారు. 2025 ఏప్రిల, డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా మొత్తం రూ.26.6 లక్షల కోట్లు పెట్టుబడులకు ప్రతిపాదనలు జరిగాయి. ఇందులో 25.3 శాతం వాటాను ఆంధ్రప్రదేశ్ దక్కించుకుంది. తర్వాతి స్థానంలో ఒడిశా 13.1 శాతం పెట్టుబడులకు తమ రాష్ట్రానికి తీసుకెళ్లింది. ఇక ఆర్థిక రాజధాని ముంబై 12.8 శాతం పెట్టుబడ్డులు (మిగతా 2లో)

# జనంలోకి జగన్



- జగన్ పర్యటనలకు ముహూర్తం ఫిక్స్ చేసే దిశగా అడుగులు..
- కేసులు నమోదైన నేతల విషయంలో కీలక నిర్ణయాలు..
- వైసీపీ ఓడి, పార్టీ వీడిన నాయకుల నియోజక వర్గాలకు ప్రాముఖ్యత..
- గోదావరి జిల్లాల నుంచి పర్యటనలు ప్రారంభం..?

**తాడేపల్లి (తెలుగోడు), జనవరి 3 :**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ ఏడాది జనంలోకి వెళ్లేందుకు ముహూర్తం ఖరారవుతోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలను వ్యతిరేకించిన జగన్ పార్టీ పరంగా నిరసనలు కొనసాగించారు. గత ఏడాదిలోనే జిల్లాల పర్యటన కు వెళ్లాలని భావించినా వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు జగన్ కొత్త ప్లాన్ తో సిద్ధం అయ్యారు. పార్టీ ముఖ్య నేతలతో కీలక చర్చలు కొనసాగినట్లు సమాచారం. జగన్ వ్యూహాత్మకంగా కొన్ని నియోజకవర్గాలను ఎంపిక చేసారు. అక్కడ పర్యటనకు ముహూర్తం ఫిక్స్ చేసారు. అదే విధంగా కేసులు నమోదైన నేతల విషయంలోనూ జగన్ కీలక న్ణియం తీసుకున్నారు. మాజీ సీఎం జగన్ పర్యటనలకు సిద్దం అవుతున్నారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయంగా ప్రస్తుతం పరిస్థితుల పైన సర్వే నివేదికలు (మిగతా 2లో)

# పోటీకి సిద్ధమవ్వాలి



- పోరాట పటిమ, చైతన్యం, తెగింపు అన్నీ తెలంగాణ నుంచే వచ్చాయి..
- తెలంగాణ నేల తనకు పోరాడే ధైర్యాన్ని ఇచ్చింది..
- గెలుపోటములు సహజం..
- కార్యకర్తలతో భేటీలో పవన్ కళ్యాణ్..

**జగిత్యాల (తెలుగోడు), జనవరి 3 :**

జగిత్యాలలో జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో గెలుపు,ఓటములు సహజమని, అయితే పోటీ చేయడం అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రాజకీయ జీవితంలో తనకు పోరాట పటిమ, చైతన్యం, తెగింపు అన్నీ తెలంగాణ నుంచే వచ్చాయని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. తెలంగాణ నేల తనకు పోరాడే ధైర్యాన్ని ఇచ్చిందని, ఈ ప్రాంత (మిగతా 2లో)

# అమోఘం..అద్భుతం



- సిఎం చంద్రబాబు దార్శనికతే పెట్టని కోట..
- చంద్రబాబుతోనే ఏపీ ప్రగతి..
- పెట్టుబడుల్లో ఎపికి అగ్రస్థానంపై ఆనందం..
- హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్య

**అమరావతి (తెలుగోడు), జనవరి 3 :**

పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా నిలవడం అమోఘం, అద్భుతమంటూ ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు, మంత్రి నారా లోకేశ్ నిబద్ధతకు నిదర్శనంగా.. పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్‌గా నిలిచిందని వ్యాఖ్యానించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ? అఓఎఇ విడుదల చేసిన నివేదిక ప్రకారం 25.3 శాతం (మిగతా 2లో)

# గతంలో డ్రగ్స్‌కి కేంద్రం



- వైసీపీ హయాంలో డ్రగ్స్‌కి క్యాపిటల్‌గా ఏపీ ...
- దేశంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా మూలాలు ఇక్కడే...
- పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు..

**శ్రీకాకుళం (తెలుగోడు), జనవరి 3 :**

వైసీపీ హయాంలో ఏపీ డ్రగ్స్‌కి క్యాపిటల్‌గా ఉండేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో గిరిజనులను బలిపశువులను చేశారని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఏపీలో ఉండేవని విమర్శలు చేశారు. ఆ పరిస్థితి మారాలని ఈ మహమ్మారిపై యుద్ధం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. శనివారం శ్రీకాకుళం (మిగతా 2లో)

# లొంగిపోయిన మావోలు

- మావోఇస్టు అగ్రనేత బర్సే సుక్కా అలియాస్ దేవా లొంగుబాటు..
- ఆయుధాలు, డబ్బును అప్పగించిన మావోయిస్టులు...
- డిజిపి శివధర్ రెడ్డి ముందు లొంగుబాటు..
- తెలంగాణకు చెందిన రాజిరెడ్డి అతని భార్యతో పాటు 20 మంది లొంగుబాటు...



**హైదరాబాద్ (తెలుగోడు), జనవరి 3 :**

మావోయిస్టుల లొంగుబాటు కొనసాగింది. మరికొందరు అగ్రనేతలు లొంగుబాటు పట్టారు. అగ్రనేత బర్సే సుక్కా అలియాస్ దేవా, తెలంగాణకు చెందిన రాజిరెడ్డి అతని భార్యతో పాటు 20 మంది సభ్యులు భారీగా ఆయుధాలు, నగదు అప్పగించి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. నిన్ననే లొంగిపోగా.. ఆ వివరాలను డీజీపీ శనివారం మీడియాకు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ గెరిల్లా ఆర్మీ చీఫ్‌గా దేవా పని చేస్తున్నారు. లొంగిపోయిన వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. హెలికాప్టర్లను కూల్చేందుకు వాడే సామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ లొంగుబాటు పీఎల్‌జీఏ కు భారీ దెబ్బగా భావిస్తున్నట్లు చెప్పారు. దేవా.. హిడ్మా సొంత గ్రామానికి చెందిన వాడు. ఎన్ఐఏ నుంచి దేవాపై రూ.75లక్షల రివార్డు ఉంది. ఆవులం సోమా, భేమే, సుశీల, వేముల రాజు, నందయ్యా, మంకు, అండా, తెలంగాణ స్టేట్ కమిటీ సభ్యురాలు అడ్లూరి ఈశ్వరి లొంగిపోయినవారిలో ఉన్నారు. 2 పెణ, యూఎస్ఏ తయారీ కోల్ట్ ఆయుధంతో వచ్చారు. ఇజ్రాయెల్ దేశంలో తయారు చేసిన టవర్ ఆయధం కూడా ఉంది. ఎనిమిది ఏకే 47 గన్స్ స్వాదీనం చేసుకున్నాం. ఌాఒఖీ 8, నాలుగు బ్యారేల్ గ్రానైడ్ లాంచర్స్ ఆయుధాలను సమర్పించారు. హెలికాప్టర్‌ను సైతం కూల్చే భారీ ఆయుధం సైతం తీసుకు వచ్చారు. పీఎల్‌జీఏబెటాలియన్‌లో 400 (మిగతా 2లో)

## విదేశీ పర్యటన ముగించుకుని

# నేడు రానున్న చంద్రబాబు

- చంద్రబాబు విదేశీ టూర్‌కు రహస్యంగా వెళ్లడంపై రాష్ట్రంలో చర్చ..
- సిఎం హెూదాలో షెడ్యూల్ విడుదల చేయకుండా పర్యటనలపై వైసీపీ విమర్శ..
- పర్యటన ముగించుకుని నేడు హైదరాబాద్‌కు చంద్రబాబు..
- ఎల్లుండు అమరావతికి వచ్చే అవకాశం..టిడిపి శ్రేణులు..



**అమరావతి, (తెలుగోడు), జనవరి 3 :**

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటన నుంచి తిరిగి రానున్నారు. చంద్రబాబు తాజాగా విదేశీ టూర్ కు రహస్యంగా వెళ్లడంపై రాష్ట్రంలో చర్చ జరుగుతోంది. కొత్త సంవత్సర వేళ చంద్రబాబు సీఎం హెూదాలో అధికారిక షెడ్యూల్ విడుదల చేయకుండానే విదేశీ పర్యటనకు వెళ్లడంపై విపక్ష వైఎస్సార్సీపీ విమర్శలు గుప్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన తిరిగి వస్తున్నట్లు టీడీపీ వర్గాలు ఇవాళ వెల్లడించాయి. చంద్రబాబు రేపు సాయంత్రం నాలుగున్నరకు హైదరాబాద్ లోని శంషాబాద్ విమానాశ్రయానికి విదేశాల నుంచి వస్తారని టీడీపీ వర్గాలు చెప్తున్నాయి. అనంతరం హైదరాబాద్ లోనే విశ్రాంతి తీసుకుని అనంతరం ఎల్లుండి అమరావతికి వచ్చే అవకాశముంది. కొత్త సంవత్సరం వేళ ఉన్నట్లుండి విదేశీ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు ఆ టూర్ వ్యక్తిగతమా లేక అధికారికమా అనే వివరాలు ఇవ్వకపోవడంపై చర్చ జరుగుతోంది. దీంతో వైసీపీ కూడా విమర్శలకు దిగింది. ప్రజలకు సమాచారం లేకుండా సీఎం (మిగతా 2లో)

# జనంలోకి జగన్



(మొదటి పేజి (తరువాయి)

తెప్పించుకున్నారు. వీటి ఆధారంగా పార్టీలోని ముఖ్య నేతలతో మాట్లాడారు. ఈ నెల చివరి వారం నుంచి ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో పర్యటన నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఇందు కోసం గోదావరి జిల్లాలను ముందుగా ఎంపిక చేసుకున్నారు. అదే విధంగా పార్టీ ఎన్నికల్లో ఓడిన తరువాత వైసీపీ వీడిన నేతల నియోజకవర్గాల్లోనూ జగన్ వరుస పర్యటనలకు షెడ్యూల్ సిద్దం చేస్తున్నారు. ఈ సారి జగన్ గోదావరితో పాటుగా ఉత్తరాంధ్ర పైన ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. అక్కడి పరిస్థితుల పైన ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. తొలి పర్యటన తూర్పు గోదావరి నుంచి ప్రారంభించేలా ప్రణాళికలు సిద్దం అవుతున్నాయి. పార్టీ కేడర్ తో ఈ నియోజకవర్గాల్లో జగన్ ప్రత్యేకంగా భేటీ కానున్నారు. వారి సమస్యలను వినటంతో పాటు స్పష్టమైన హామీలు ఇవ్వనున్నారు. అదే విధంగా కేసులు ఎదుర్కొంటున్న పార్టీ నేతల విషయంలోనూ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేసులు ఎదుర్కొంటున్న నేతల నియోజకవర్గాల్లోనూ జగన్ పర్యటించి ప్రభుత్వం వేధింపుల్లో భాగంగా కేసులు నమోదు చేస్తుందని కేడర్ కు పార్టీ అండగా నిలుస్తుందని హామీ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ నేతల సమాచారం. అందులో భాగంగా వంశీ, జోగి రమేశ్, పేర్ని నాని, పిన్నెల్లి, కాకాణి గోవర్ధన్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర రెడ్డి వంటి నేతల నియోజకవర్గాలకు వెళ్లనున్నారు. ఒంగోలు, గన్నవరం, మైలవరం నియోజవకవర్గాల్లో సభలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన జగన్ పార్టీ ముఖ్య నేతలతో తాడేపల్లిలో భేటీ కానున్నారు. ఆ సమావేశంలో ఈ పర్యటన సభలకు సంబంధించి అధికారికంగా ముహూర్తం ఖరారు కానుంది.

# గతంలో డ్రగ్స్‌కి కేంద్రం


(మొదటి పేజి (తరువాయి)

ఇచ్ఛాపురంలో అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సభకు హోంమంత్రి అనిత, రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు రామ్మోహన్ నాయుడు. ఏపీని ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంచడానికి చంద్రబాబు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారని చెప్పుకొచ్చారు. ఈ కృషిలో ఆంధ్రప్రదేశ్ పోలీసుల పని తీరు వర్ణించలేనిదని కొనియాడారు. గతంలో పోలీసులను రాజకీయ వేధింపులకు వాడుకునే వారని విమర్శించారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో పోలీసులకు శిక్షించడం మాత్రమే కాదని.. శిక్షణ ఇవ్వడం కూడా తెలుసు అనేలా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఒకప్పుడు పంజాబ్ వ్యవసాయానికి ప్రసిద్ధిగా ఉండేదని ప్రస్తావించారు. ఇప్పుడు పంజాబ్‌లో అడుగడుగునా డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని విమర్శించారు. పంజాబ్ రాష్ట్రం పూర్తిగా నాశనం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంజాబ్‌లా ఏపీ మారకూడదనే తాము కంకణం కట్టుకున్నామని చెప్పుకొచ్చారు రామ్మోహన్ నాయుడు. గతంలో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో మన తల్లుల ఆవేదన చూశామని అన్నారు. తమకేం వద్దని.. రాష్ట్రంలో డ్రగ్స్ లేకుండా చేస్తే చాలని మన తల్లులు లోకేశ్‌ని కోరారని తెలిపారు. ప్రతీ ఇంట్లో డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మన ఇంట్లోనే కాదని.. పక్క ఇంట్లో కూడా ఎవరైనా డ్రగ్స్ వాడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఒకరిని చూసి ఇంకొకరు నేర్చుకుంటారని అన్నారు. డ్రగ్స్ వాడకం కూడా అలాగే ఉంటుందని చెప్పుకొచ్చారు. సిగరెట్, డ్రగ్స్ వాడకం స్టైల్ కాదని.. నిజాయితీగా ఉండటం మాత్రమే అసలు సిసలైన్ స్టైల్ అని పేర్కొన్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనేది పిల్లల నినాదం కావాలని సూచించారు. శ్రీకాకుళం అంటే లేబర్ ప్రాంతం కాకూడదని తెలిపారు రామ్మోహన్ నాయుడు. శ్రీకాకుళం అభివృద్ధికి అడ్డా కావాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక ఫోకస్ పెట్టారని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం కూడా శ్రీకాకుళం అభివృద్ధికి సహాయం చేస్తోందని వెల్లడించారు. డ్రోన్స్ సాయంతో డ్రగ్స్ పంటలను గుర్తించామని తెలిపారు. డ్రగ్స్‌కి బదులు ఇప్పుడు మంచి పంటలు పండిస్తున్నామని వివరించారు. ఇచ్ఛాపురంలో చాలా కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఇప్పుడు అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు యాత్ర నిర్వహించామని.. ఈ ముగింపు యాత్రను పోలీసులు చాలా గొప్పగా ఏర్పాటు చేశారని రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు.

# అంజన్న వల్లే ప్రాణాలతో వున్నా

## కొండగట్టు అంజనేయుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

## పలు అభివృద్ధి పనులకు పవన్‌కళ్యాన్ శంకుస్థాపన



**జగిత్యాల (తెలుగోడు), జనవరి 3 :**

కొండగట్టు అంజన్న దయ వల్లనే తాను ప్రాణాలతో బయటపడ్డానని, ఆయనంటే తనకు ఎన్నలేని భక్తి విశ్వాసాలని ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం పవన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ.35.19 కోట్ల తితిదే నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. తితిదే సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది' అని అన్నారు. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పోటీకి సిద్ధమవ్వాలి



(మొదటి పేజి (తరువాయి)

ప్రజల స్ఫూర్తే తనను ముందుకు నడిపించిందని చెప్పారు. అంజన్న సన్నిధి తనను కాపాడిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కష్టకాలాల్లో ఆధ్యాత్మిక బలం తనకు అండగా నిలిచిందని అన్నారు. ఓటమికి భయపడకుండా పోటీ చేసే మనస్తత్వం జనసేనలో పెరగాలని సూచించారు. పోటీ పడినప్పుడే అనుభవం వస్తుందని, ప్రజల మధ్య ఉండగలమని తెలిపారు. వ్యక్తిగతంగా ఎవ్వరూ తనకు శత్రువులు కాదని స్పష్టం చేసిన పవన్ కళ్యాణ్, తమ పోరాటం వ్యక్తులపై కాదని, పాలసీ ప్రకారమే జరుగుతుందని అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం, సరైన విధానాల కోసం మాత్రమే తాము రాజకీయాల్లో పోరాటం చేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసైనికులు ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి జనసైనికుడిపై ఉందని అన్నారు. చివరగా వంద మైళ్ల ప్రయాణం కూడా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని పేర్కొన్న పవన్ కళ్యాణ్, జనసేన ప్రయాణం ఇప్పుడు బలంగా మొదలైందని, ముందున్న లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.

## ప్రకృతి వ్యవసాయం చేసే

# రైతన్నలకు బాసట

## అదనంగా 4వేల ప్రోత్సాహం ఇవ్వాలన్న మాధవ్



**విజయవాడ (తెలుగోడు), జనవరి 3 :**

ప్రకృతి వ్యవసాయం చేసే వారికి అదనంగా రూ.4 వేలు ప్రోత్సాహకాలు ఇవ్వాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. విజయవాడలో శనివారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై సహజ రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ విధానంతో మంచి దిగుబడి సాధించిన అన్నదాతలను మాధవ్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు మాధవ్. ప్రకృతి వ్యవసాయం చేసే వారి ఇబ్బందులు, కొత్త పద్ధతులు, ఆదర్శవంతమైన సాగుచేసే వారితో నేడు ఈ సదస్సు ఏర్పాటు చేశామని వెల్లడించారు పీవీఎన్ మాధవ్.ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా విజయవంతమైన రైతన్నల అభిప్రాయాలు, అనుభవాలు వివరించారని అన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్దంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. జాతీయ, ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంపై అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఫసల్ భీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సీడీ ఇచ్చేలా భరోసా ఇచ్చారని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం చేసే వారిని అన్నివిధాలా ప్రోత్సహించాలని సూచించారు. దేశంలో ముప్పై శాతం మంది ప్రకృతి వ్యవసాయం రావాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని అన్నారు. ఆర్థిక స్వావలంబన కావాలంటే ప్రకృతి వ్యవసాయ విధానమే మార్గమని చెప్పుకొచ్చారు పీవీఎన్ మాధవ్. ఇతర దేశాలపై ఆధారపడి యూరియా, పురుగు మందులు కొనే విధానం ఆగిపోవాలని సూచించారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. రైతు బజార్లలో కొన్ని స్టాల్స్‌ను పెడుతున్నారని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన ఉత్పత్తులతో ప్రత్యేకంగా సంతలు, రైతు బజార్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు.

కేంద్రం అమలు చేసే పథకాల గురించి అందరూ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరూ ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లేలా ప్రోత్సహించాలని కోరారు. ఈరోజు సదస్సులో చేసిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరిస్తామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.

## ఘనంగా తెలుగోడు దినపత్రిక

# 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**ముదిగుబ్బ (తెలుగోడు), జనవరి 3 :**

ముదిగుబ్బ తహశీల్దార్ కార్యాలయంలో తెలుగోడు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహశీల్దార్ నారాయణస్వామి శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, అధికారులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వుంటూ నిస్పక్షపాతంగా వార్తలను తెలుగోడు దినపత్రికలో ప్రచురిస్తున్నారన్నారు. సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ ఏ ఒక్క పెత్తందారులకూ, రాజకీయ నాయకులకూ వత్తాసుపలకుండా అందరికీ అనుకూ లంగా వ్యవహరిస్తూ వాస్తవ వార్తలు తెలుగోడు ద్వారా అందుతున్నాయన్నారు. మరీ ముఖ్యంగా చాలా పత్రికల్లో వార్తల్లో స్పష్టత వుండదని, తెలుగోడు దినపత్రికలో ప్రతి వార్త కూలంకుశంగా అర్థమయ్యే రీతిలో వుండి పత్రిక పూర్తీగా చదవాలనిపిస్తుందన్నారు. ప్రాంతాలు, కులాలు, మతాలు అనేది లేకుండా అన్ని వర్గాలకూ సంబంధించిన వార్తలను ప్రచురిస్తోందన్నారు. భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్న పత్రికల్లో తెలుగోడు దినపత్రిక తనదైన శైలిలో వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్తుండటం సంతోషించ దగ్గ విషయమన్నారు. మరీ ముఖ్యంగా తెలుగోడు దిన పత్రికలో పని చేస్తున్న పాత్రికేయులందరూ జర్నలిజం పై పట్టున్న వారున్నారు. వార్తల కూర్పును బట్టే అర్థమవుతోందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరిస్తూ తెలుగోడు దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఏఎస్‌వో చంద్రశేఖర్ నాయుడు, జూనియర్ అసిస్టెంట్ గీత, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ భారస్కర్‌రెడ్డి, ముదిగుబ్బ మండల జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటనాయుడు, ఆర్‌వోలు వీరయ్య, నరేంద్రలు పాల్గొని క్యాలెండర్ రూపకల్పన ఆకర్షణీయంగా వుందని అభినందించారు.

# పెట్టుబడుల ఆకర్షణలో అగ్రగామి

(మొదటి పేజి (తరువాయి)

దక్కించుకుంది. దేశం మొత్తానికి వచ్చిన పెట్టుబడుల్లో సగానికిపైగా అంటే 51.2 శాతం వాటాలను ఈ మూడు రాష్ట్రాలే ఆకర్షించాయి. అందులో 25 శాతం వాటా ఏపీకే రావడం సంతోషకరమైన పరిణామంగా చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందరర్భేగా సీఎం చంద్రబాబు.. తన ఆనందాన్ని పంచుకున్నారు. "ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎంతో శుభవార్త. ఈ ఏడాదికి ఒక గొప్ప ఆరంభం. మన ముందుచూపుతో తీసుకున్న విధానపరమైన సంస్కరణలు, ముఖ్యంగా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చొరవలు ఏ విధంగా ప్రభావం చూపుతున్నాయో అనే దానికి ఇదే నిదర్శనం. ఇందులో భాగంగా, ప్రోత్సాహకాలను సకాలంలో పారదర్శకంగా పంపిణీ చేయడం కోసం ప్రవేశపెట్టిన 'ఎస్క్రో ఆధారిత యంత్రాంగం' ప్రవేశపెట్టడంతో ఆంధ్రప్రదేశ్‌ను అభివ ృద్ధి తమ గమ్యస్థానంగా ఎంచుకుంది. మా దార్శనికతపై నమ్మకం ఉంచినందుకు పెట్టుబడిదారులకు నా క ృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగ నిబద్ధతను, క ృషిని నేను అభినందిస్తున్నాను. ఈ మైలురాయి ముగింపు కాదు, నిరంతర పురోగతికి ఇది ఒక పునాది. రాష్ట్రాన్ని మరింత అభివ ృద్ధి పథంలో నడిపించడానికి, భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి, స్థిరమైన వ ృద్ధిని అందించడానికి మేము నిరంతరం క ృషి చేస్తూనే ఉంటాము" అని ఎక్స్ లో రాసుకొచ్చారు.

# అమోఘం.. అద్భుతం

(మొదటి పేజి (తరువాయి)

వాటాతో ఆంధప్రదేశ్ అగ్రస్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు హోంమంత్రి అనిత. 2025 ఏప్రిల్ –డిసెంబర్ మధ్య రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వాటా గణాంకాలు రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని చెప్పుకొచ్చారు. జగన్ హయాంలో వేధింపులు, కక్ష సాధింపులతో పతనావస్థకు చేరిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏపీ పారిశ్రామిక అభివృద్ధి పరంగా ముందుకు దూసుకెళ్తుందని వెల్లడించారు హోంమంత్రి అనిత. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో సిస్టమ్ వంటి సంస్కరణల ద్వారా పెట్టుబడిదారుల్లో పెరిగిన నమ్మకమే రాష్ట్రాన్ని టాప్ ప్లేస్‌కు చేర్చడంలో కీలకంగా నిలిచిందని వివరించారు. కేవలం 18 నెలల్లో ఏపీకి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 26 లక్షల ఉద్యోగ అవకాశాలను తమ ప్రభుత్వం తీసుకువచ్చిందని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# లొంగిపోయిన మావోలు

(మొదటి పేజి (తరువాయి)

మంది సభ్యులు ఉండగా.. ప్రస్తుతం 66 మంది మాత్రమే మిగిలారు. పీఎల్‌జీఏ పూర్తిగా క్షీణించింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా కిష్టంపేట్‌కు చెందిన రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా రాష్ట్రానికి చెందిన ఒక్కరు మాత్రమే స్టేట్ కమిటీలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో మావోయిస్టులు ఆత్మ సమర్పణ చేసుకున్నారు. డివిజన్ సభ్యులకు రూ.5లక్షలు, ఏరియా సభ్యులకు రూ.4లక్షలు, మిగతా సభ్యులకు రూ.లక్ష రివార్డు ఉంది. రూ.1.80 కోట్ల రివార్డు లొంగిపోయిన మావోయిస్టులకు అందిస్తాం. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఇస్తాం. ఇప్పటి వరకు తెలంగాణలో 576 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ సమాచారం ప్రకారం ప్రస్తుతం తెలంగాణ నుంచి 17 మంది సభ్యులు మిగిలి ఉన్నారు. మిగిలిన మావోయిస్టులు కూడా లొంగిపోవాలని కోరుతున్నాం అని డీజీపీ తెలిపారు.

# నేడు రానున్న చంద్రబాబు

(మొదటి పేజి (తరువాయి)

చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ కూడా విదేశాలకు వెళ్లడం ఏంటని ప్రశ్నిస్తోంది. అలాగే టీడీపీ వర్గాలు, ప్రభుత్వ అధికారులు కూడా ఈసారి చంద్రబాబు విదేశీ పర్యటనపై నోరు మెదపలేదు. దీంతో కొత్త ఏడాది వేళ ఇంత రహస్యంగా ఎందుకు చంద్రబాబు ఇలా ఎవరికీ చెప్పకుండా విదేశాలకు వెళ్లారన్న దానిపై రాజకీయ పార్టీల్లో చర్చ జరుగుతోంది. దీనికి మరో కారణం గతంలో చంద్రబాబు ఎప్పుడు విదేశీ పర్యటనలకు వెళ్లినా ఓ వర్గం మీడియాలో పూర్తి వివరాలు మినిట్ టూ మినిట్ అప్ డేట్స్ కనిపించేవి. ఈసారి అవి కూడా కనిపించకపోవడంతో రహస్య టూర్ పై చర్చ జరుగుతోంది. మరోవైపు చంద్రబాబు నాలుగు రోజులు కుటుంబంతో విదేశాలకు వెళ్తే వైసీపీ సైకోలు ఓర్చుకోలేకపోతున్నారని టీడీపీ నేత పిల్లి మాణిక్యరావు ఇవాళ కౌంటర్ ఇచ్చారు. చంద్రబాబు నాయుడు గారు విదేశాల్లో ఉన్నప్పటికీ రాష్ట్రంపై నిరంతర సమీక్ష చేస్తున్నారని తెలిపారు. రేపు ఆయన పార్టీ కార్యాలయంలో ఉంటారని వెల్లడించారు.

# గంజాయితో దొరికితే శిక్ష తప్పదు

(మొదటి పేజి (తరువాయి)

వచ్చాయని ప్రస్తావించారు. కానీ వారం రోజుల్లో ఆయన పరిస్థితిని పరిష్కరించారని చెప్పుకొచ్చారు. ఆ వారం రోజులు ఆయన పడిన కష్టం తనకు తెలుసునని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులు చేసిన కృషి అంతా ఇంతా కాదని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ నిర్మూలనపై మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. దాని కోసం ఈగల్ అని ఒక ప్రత్యేక డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేశామని వెల్లడించారు హోంమంత్రి అనిత. జీరో నుంచి మొదలు పెట్టి గంజాయి నిర్మూలన చేశామని తెలిపారు. ఇబ్బందిగా ఉంటుందని తెలిసినా చాలా విషయాల్లో పిల్లలకు డ్రగ్స్‌పై నో చెప్పడం రాదని అన్నారు. నో చెప్పడం మొదలు పెడితే మార్పు కనిపిస్తుందని చెప్పుకొచ్చారు. ఏపీలో అడుగడుగునా గంజాయి తనిఖీలు జరిగాయని తెలిపారు. తాము పని చేస్తే సరిపోదని.. పిల్లల్లో కూడా అవగాహన రావాలని అన్నారు. పిల్లలు వారి భవిష్యత్‌ని సన్మార్గంలో పెట్టుకోవాలని కోరారు. ఎవరి భవిష్యత్ వారి చేతుల్లోనే ఉంటుందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# పూర్తీ కావచ్చిన నివాసాలు



(మొదటి పేజి (తరువాయి)

అఖిల భారత సర్వీసు అధికారుల టవర్స్ కూడా తుది దశకు చేరాయని చెప్పారు. 500 నివాస సముదాయాలను మినహా, మిగతా భవనాలు మార్చి ముగింపు వరకు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అన్ని భవనాలు పూర్తైన తర్వాత జీఏడీకి హ్యాండ్ ఓవర్ చేస్తామని.. వారు కేటాయిస్తారని మంత్రి తెలిపారు. అలాగే అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్ కోసం భూసేకరణ నోటిఫికేషన్ వచ్చే బుధవారం (జనవరి 7) ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంకా 4.5 ఎకరాలు భూమి రావాల్సి ఉందని, ఇందులో 2 ఎకరాలు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# జిల్లాలో ఈథర్‌వింగ్ ఏరోస్పేస్ కార్యకలాపాల విస్తరణ

*జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో భేటీ..*
*ఈథర్‌వింగ్ ఏరోస్పేస్ సీఈఓ మనేగర్ శర్మాస్ వలీ..*

**కనేకల్(తెలుగోడు), జనవరి 3:**
ఈథర్‌వింగ్ ఏరోస్పేస్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ మనేగర్ శర్మాస్ వలీ శనివారం అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఈథర్‌వింగ్ ఏరోస్పేస్ కార్యకలాపాల విస్తరణతో పాటు "పల్లె టు ప్లానెట్" గ్రామీణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం అమలుపై ఈ భేటీలో సమగ్రంగా చర్చ జరిగింది. ఈ కార్యక్రమాన్ని విస్తార విద్యానిధి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నట్లు మనేగర్ శర్మాస్ వలీ తెలిపారు. జిల్లాలో ఆధునిక సాంకేతికత ఆధారిత శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో అనుసంధానమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం, విద్యార్థులు మరియు యువతకు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించే విధానాలపై చర్చ జరిగింది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక రంగాలతో అనుసంధానించడమే "పల్లె టు ప్లానెట్" కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని వలీ పేర్కొన్నారు.


కలెక్టర్ ఆనంద్‌ను కలిసిన ఈథర్ వింగ్ ఏరోస్పేస్ సీఈవో మనేగర్ శర్మాస్ వలీ

కనేకల్ మండలానికి చెందిన యువ పారిశ్రామికవేత్త మనేగర్ శర్మాస్ వలీ స్వస్థలంలో విద్యనభ్యసించి, సాంకేతిక రంగంలో సంస్థను స్థాపించి, తిరిగి తన జిల్లాలో విద్య , ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు జిల్లా యువతకు నూతన అవకాశాలు కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అనుసంధానం మరియు ఉపాధి సృష్టికి సంబంధించిన కార్యక్రమాలపై జిల్లా పరిపాలన సానుకూలంగా ఉందని సమావేశంలో పేర్కొనబడింది. విస్తార విద్యానిధి ట్రస్ట్ ద్వారా అమలవుతున్న "పల్లె టు ప్లానెట్" కార్యక్రమం గ్రామీణ యువతను సాంకేతిక రంగాలకు దగ్గర చేసే కీలక వేదికగా మారే అవకాశముందని సమావేశంలో చర్చ జరిగిందన్నారు.ఈ భేటీ అనంతపురం జిల్లాను సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు పరిశ్రమల అనుసంధానానికి కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ రెడ్డి

# జాతీయ రహదారి భద్రతపై అవగాహన

మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ మనోహర్ రెడ్డి..

**గుత్తి(తెలుగోడు), జనవరి 3:**
పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల నందు శనివారంజాతీయ రహదారి భద్రతా మాసొస్తవాల సందర్భంగా గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల బస్సు డ్రైవర్లు, రవాణా సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ మనోహర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణ నష్టానికి దారి తీస్తుందని హెచ్చరించారు.అనంతరం అత్యవసర పరిస్థితుల్లో మరియు అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలి, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్‌ను సరైన విధంగా ఎలా ఉపయోగించాలి మరియు టెక్నాలజీని ఉపయోగించి సమస్యను ఎలా అధిగమించాలో అనే అంశాలపై మనోహర్ రెడ్డి మరియు ఆయన సిబ్బంది ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. కార్యక్రమం చివరలో రహదారి భద్రతపై అందరూ ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ పద్మావతమ్మ, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సాయినాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నమ్రత, ఏఓ ఇంతియాజ్ బాషా,బస్సు డ్రైవర్లు, రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

# గుత్తి డివిజన్ ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎంపిక

**గుత్తి(తెలుగోడు), జనవరి 3:**
గుత్తి మున్సిపాలిటీ పరిధిలోనిఆర్ఎస్ రోడ్డు లోని వసుధ ఫంక్షన్ హాల్లో శనివారం గుత్తి డివిజన్ ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీడీసీఎల్ ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల కంపెనీ సెక్రటరీ మస్తానయ్య మరియు రీజనల్ సెక్రెటరీ మల్లెల శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం గుత్తి డివిజన్ జనరల్ బాడీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుత్తి డివిజన్ ప్రెసిడెంట్గా సుధాకర్ సెక్రటరీగా తిప్పరాజు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీగా నగదాని కృష్ణ ప్రసాదును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి డివిజన్ ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


గుత్తి డివిజన్ ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గంను సన్మానిస్తున్న దృశ్యం

# లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు

*దాతల సహకారంతో అన్నదానం..*

**ఆత్మకూరు(తెలుగోడు), జనవరి 3:**
పంపనూరు సమీపాన కొండపై వై కొత్తపల్లి శ్రీ మలహోబిల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం హుండీ శనివారం లెక్కించారు. హుండీ ద్వారా రు.406957 ఆదాయం వచ్చింది. ఇన్‌స్పెక్టర్ వన్నూరు స్వామి, ఈఓ దేవదాస్, టిడిపి నాయకులు రాజా రమేష్ అర్చకులు పరంధామయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారి సన్నిధిలో ప్రతి శనివారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ శనివారం రాజా రమేష్, జయశంకర్ వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వై.కొత్తపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.


లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయ హుండీ లెక్కిస్తున్న దృశ్యం
లక్ష్మీ నరసింహా స్వామి సన్నిధిలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

# మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఖచ్చితంగా పూర్తి చేస్తాం

**ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం...**
**మెటీరియల్ నాణ్యతలో రాజీపడేది లేదు..**
**నెటాఫిం స్టాక్ గోడౌన్ పరిశీలన..**
**మంత్రి పయ్యావుల కేశవ్..**

**బెళుగుప్ప (తెలుగోడు )జనవరి 3 :**
మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (కమ్యూనిటీ లిఫ్ట్ కమ్ డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్) రైతులకు ఎంతో ఉపయోగకరమని, దీనిని ఖచ్చితంగా పూర్తి చేసి తీరతామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, కూడేరు, బెళుగుప్ప మండలాలకు బిందు సేద్యం ద్వారా 50,000 ఎకరాలకు సాగునీటిని అందించేందుకోసం హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పేజ్-2లో భాగంగా 890.60 కోట్ల రూపాయలతో 2014-19 మధ్య రూపొందించిన మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (కమ్యూనిటీ లిఫ్ట్ కమ్ డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్) పనులను గత ప్రభుత్వంలో నిలిపివేశారు. ఆ పనులను తిరిగి ప్రారంభించేందుకు ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామం వద్దనున్న నెటాఫిం స్టాక్ గోడౌన్ ను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ని ఎకరాల్లో ఈ స్టాక్ గోడౌన్ ఉంది, ఎంత మెటీరియల్ ఉంది, ఏ రకమైన మెటీరియల్ ఉంది,


ఆమిద్యాల వద్ద ఉన్న నెటాఫిం స్టాక్ గోడౌన్‌ను పరిశీలించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్


ఆమిద్యాల వద్ద ఉన్న నెటాఫిం స్టాక్ గోడౌన్‌ను పరిశీలించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

తదితర వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడున్నర ఎకరాల్లో స్టాక్ గోడౌన్ ఉందని, మెటీరియల్ గురించి, ఇతర వివరాలను మ్యాప్ ద్వారా అధికారులు వివరించారు. పివిసి పైపులు, ఇతర మెటీరియల్‌కు సంబంధించి టెస్టింగ్ కి పంపించడం జరిగిందన్నారు.ఇ-ఈ సందర్భంగా మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను గత ప్రభుత్వం మధ్యలోనే ఆపివేయడం చాలా దుర్మార్గమైనదన్నారు. 2014 - 19 కాలంలో తమ ప్రభుత్వం మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టును అమలు చేసి ఉంటే లక్షలాది మంది రైతులు బాగుపడే వారన్నారు. ఈ ప్రాజెక్టు అమలు చేయడం ద్వారా జీవితకాలం బాగుండాలని, మెటీరియల్ నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. మెటీరియల్ నాణ్యత పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వ ల్యాబ్ కు పంపించడం జరిగిందని, క్వాలిటీ అప్రూవల్ లేకుండా ఏవి వాడవద్దన్నారు. అద్భుతమైన టెక్నాలజీతో ఈ ప్రాజెక్టు కింద మెటీరియల్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టును ఖచ్చితంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతకుముందు హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ లో 203వ కిలోమీటర్ వద్ద అమిద్యాల లిఫ్ట్ ఇరిగేషన్ ఆఫ్ టేక్ పాయింట్ ను మంత్రి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ సీఈ నాగరాజ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ప్రాజెక్ట్ డిఈఈ వెంకటరమణ, ఏఈఈ నాగభూషణం, మధుకర్, నరేష్, ప్రాజెక్ట్ మేనేజర్ శ్యామ్ రెడ్డి, అగ్రనమిస్టు రమణారెడ్డి, మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.


ఆమిద్యాల వద్ద ఉన్న నెటాఫిం స్టాక్ గోడౌన్‌ను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

# సావిత్రిబాయి పూలే జయంతి

**గుత్తి(తెలుగోడు), జనవరి 3:**
భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయుని సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా గుత్తిఆర్ఎస్లో పలువురు ప్రజాసంఘాల నాయకులు రాజకీయ పార్టీల నాయకులు ఆమెకు ఘనంగా నివాలర్పిచారు. ఈ సందర్భంగా ఆమె సేవలను గుర్తుచేస్తూ నాయకులు ప్రసంగించారు. (1831 జనవరి 3 1897 మార్చి 10) భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది.కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు
నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసింది. సమాజంలోని కులతత్వం, పురుషాధిక్య ధోరణులు కలిగిన


సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చాలామంది పండిత మేధావులందరికీ కూడా ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమ కారిణి అని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కె ఎం రంగనాయకులు, జీ యం బాషా, కౌన్సిలర్ వరదరాజులు, టీ.వెంకటేశ్వర్లు అలియాస్ టి.వెంకీ, అరుణ్ కుమార్, నరసింహులు, శేఖర్, దేవవరం తదితరులు పాల్గొన్నారు.


కుంటలో బంకుల్లో సోదాలు చేస్తున్న సీఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది

# తాగుడు కుటుంబానికి దూరం చేస్తుంది

**కుంటలోని బంకుల్లో తనిఖీలు..**
**సీఐ శ్రీనివాసులు..**

**యాడికి(తెలుగోడు) జనవరి 3:**
యాడికి మండల కేంద్రంలోని కుంటలో శనివారం ఉదయమే సీఐ శ్రీనివాసులు పోలీస్ సిబ్బందితో తనిఖీలు చేశారు. కల్లు దుకాణం లైసెన్సుపై ఆరా తీశారు. అనంతరం బంకు యజమానులతో సమావేశం నిర్వహించారు. రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకు జీవులైన ప్రతి ఒక్కరూ తమ సంపాదించిన సంపదనంతా కుటుంబం కోసం , కుటుంబం అభివృద్ధి కోసం పాటుపడాలని, ఇలా చేయడం వలన కుటుంబ సభ్యులతో కలిసిమెలిసి సఖ్యతగా జీవించవచ్చన్నారు. అలా కాకుండా తాగుడుకు బానిసైతే కుటుంబమే వారికి వారిని దూరం చేస్తుందని సి ఐ శ్రీనివాసులు ప్రజలకు హితబోధ చేశారు. కుంటలో ప్రత్యేకంగా ప్రజలకు తాగుడు గురించి , దానివలన కలిగే దుష్ఫలితాల గురించి వివరించి అవగాహన కల్పించారు. కుంటలో బంకుల్లో మద్యం తాగేడం మంచిది కాదని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం తాగే వారు కూడా వారి కుటుంబం గురించి ఆలోచించాలని తాగుడులకు బానిసయి జీవితాలను నాశనం చేసుకోవద్దని మీ పిల్లలకు మంచి చదువు చదివించుకొని మీ కుటుంబ సభ్యులు బాగుండాలని సీఐ శ్రీనివాసులు ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రతిరోజు కుంటలో తనిఖీ చేస్తామని ఎవరైనా కుంటలోని బంకుల్లో మందు తాగించిన అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్. రాజశేఖర్ రెడ్డి. శివ గౌడ్. కానిస్టేబుల్ భాష. శివ. తదితరులు పాల్గొన్నారు


యాడికిలోని కుంటలో మద్యంపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న శ్రీనివాసులు


పోలీసులను అరెస్ట్ చేసిన మట్కాబీటర్లు.
స్వాధీనం చేసుకున్న నగదు

# ఆరుగురు మట్కాబీటర్ల అరెస్టు

*రూ. 40 వేల నగదు స్వాధీనం.*
*ఎస్ఐ సురేష్ ..*

**గుత్తి(తెలుగోడు), జనవరి 3:**
గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీలో గత కొంతకాలంగా మట్కా నిర్వహిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ఆరుగురు వ్యక్తులు అరెస్ట్ చేసి వారి నుండి 40 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. గుత్తి టౌన్ లోని అమృత టాకీస్ వెనకాల ఉన్నటువంటి ఎస్సీ కాలనీలో మట్కా నిర్వహిస్తున్నవ్యక్తుల మున్సిపాలిటీ పరిధిలోని అమృత టాకీస్ కి వెనకవైపున గల ఎస్సీ కాలనీ చెందిన మాతంగి రంగమ్మ గుత్తి ఆర్ ఎస్ హోరబ్ ఏరియాకు చెందిన నల్ల నాగరాజు, గుత్తి ఆర్ఎస్గుత్తి పట్టణంలోని సిపిఐ కాలనీకి చెందిన వడ్డే రాజు, గుంతకల్లు మండలం చింతలశీపల్లి గ్రామానికి చెందిన కాసా శ్రీనివాసరెడ్డి నంద్యాల జిల్లా గుడిపాడు కు చెందిన షాను బాషా, పెద్దవడుగూరు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన. తపిల మధు,పట్టుకొని వారి వద్ద నుండి 40,200 నగదును సీజ్ చేసి కేసు నమోదు చేపినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.


సింగంపల్లి తాండా ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ గౌతమ్

# సైబర్ క్రైమ్‌పై అవగాహన

ఎస్ఐ గౌతమ్..

**ఆత్మకూరు(తెలుగోడు), జనవరి 3:**
మండల పరిధిలోని సింగంపల్లి తాండా గ్రామంలో ప్రజలకు సైబర్ క్రైమ్‌పై ఎస్ఐ గౌతం శనివారం అవగాహన అవగాహన కల్పించారు. వివాదాలకు దూరంగా ప్రజలు పల్లెల్లో ప్రశాంతంగా ఉండాలని, ఏవైనా సమస్యలు వస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలాన్నారు. అనవసర విషయాల జోలికి వెళ్లి సమస్యల్లో చిక్కి ఇబ్బందులు పడవద్దని సూచించారు.


పట్టణంలో కార్బన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

# సిపిఐ కాలనీలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**గుత్తి(తెలుగోడు), జనవరి 3:**
గుత్తి టౌన్‌లోని సిపిఐ కాలనీలో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ఇళ్లను తనిఖీ చేసి చట్ట వ్యతిరేక చర్యలకు తావు ఇవ్వకుండా సూచనలు ఇచ్చారు. అదేవిధంగా బెల్ట్ షాపులు , గుట్కా, మట్కా నిర్వహిస్తారన్నటువంటి అనుమానితులైన ఇండ్లను తనిఖీ చేశానేజ స్టేషన్‌కు కేటాయించిన డ్రోన్ సహాయంతో చుట్టుపక్కల పరిసరాను పరిశీలించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు, మట్కా, పేకాట స్థావరాలు నిర్వహించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

# మాజీ సర్పంచ్ టి.ఓబన్నకు పరామర్శ

*వైకాపా జిల్లా మహిళా నాయకురాలు గొల్ల రాధ..*

**గుత్తి(తెలుగోడు), జనవరి 3:**
గుత్తి మండలం టీ .కొత్తపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ టి.ఓబన్నను శనివారం వైఎస్ఆర్సిపి జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షులు చంద్రగిరి గొల్ల రాధ పరామర్శించారు. టీ కొత్తపల్లి మాజీ సర్పంచ్ ఓబన్న వైకాపాలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేయడంతో పాటు యాదవ సంక్షేమ సంఘం అభివృద్ధికి తనవంతు సేవలందిస్తున్నాడు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురై గుంతకల్లు పట్టణంలోని లైఫ్ లైన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న చంద్రగిరి గొల్ల రాధ శనివారం ఆస్పత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు. అన్ని విధాలుగా అండదండగా ఉంటామని హామీ ఇచ్చారు.


మాజీ సర్పంచ్ టి.ఓబన్నను పరామర్శిస్తున్న వైకాపా నాయకురాలు చంద్రగిరి గొల్ల రాధ



యుటిఎఫ్ 2026 నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

**అగళి(తెలుగోడు), జనవరి 3 :** ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అగళి మండలం వనరుల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్, డైరీలు,స్టిక్కర్లనూ సంఘ కార్యవర్గ సభ్యుల సమక్షంలో మండల విద్యాశాఖ అధికారులు కృష్ణమూర్తి రాజు,చంద్రశేఖరనాయుడు ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో సంఘాల ప్రాధాన్యత ఉపాధ్యాయ సంఘాల సంఘటితం యొక్క ఆవశ్యకతల గురించి తెలియజేశారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ కార్యవర్గ సంఘం అధ్యక్షులు హరీష్, భరత్, కోశాధికారులు రమేష్, కావ్య, ఉపాధ్యాయులు ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధుడి,ఇరిగేపల్లి పంచాయతీల్లో చింతతోపుల వేలంపాట

పంచాయతీ కార్యదర్శి మహేష్..



**అగళి(తెలుగోడు), జనవరి 3 :** మండలంలోని మధుడి గ్రామ పంచాయతీ పరిధి లోని 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న చింత చెట్ల ఫలసాయానికి ఈనెల 6 వ తేదీ మంగళవారం మధూడి గ్రామపంచాయతీ కార్యాలయం నందు గ్రామపంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట మధ్యలో బహిరంగ వేలంపాట నిర్వహించ నున్నట్లు గ్రామపంచాయతీ సెక్రటరీ మహేష్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు వేలం పాట ప్రారంభానికి ముందుగా 5000 రూపాయలు ధరావతు మొత్తం చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసి ఉంటుందని వారు తెలిపారు.వేలంపాట దక్కించుకున్న వారికి డిపాజిట్ మొత్తం 5000 రూపాయలను వాపస్ ఇవ్వబడదన్నారు.మిగతా వారికి వెనక్కి ఇవ్వబడునని తెలిపారు.వేలం పాట పాడు వారందరూ తమ ఆధార్ కార్డులను తమ వెంట తీసుకొని రావాల్సిందిగా గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ తెలిపారు. అదేవిధంగా ఇరిగేపల్లి గ్రామపంచాయతీలోని చింత చెట్ల పలాసాయానికి 8వ తేదీ గురువారం ఇరిగేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం నందు పంచాయతీ సర్పంచ్ సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించబడునని గ్రామపంచాయతీ సెక్రటరీ మహేష్,తెలిపారు. వేలంపాట దక్కించుకున్న వారు అదే రోజు సాయంత్రం ఐదు గంటల లోపు పాట పాడిన మొత్తం డబ్బులను చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు. ఈ వేలం పాటలో అత్యధికంగా ప్రజలు పాల్గొని పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని తెలియజేస్తూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## రేపు వికసిత్ భరత్ గ్యారెంటీ పర్ రోజ్ గార్ అజీవిక మిషన్ అవగాహన సదస్సు

ఎంపీడీఓ నాగేశ్వరావు శాస్త్రి..



**రోళ్ల(తెలుగోడు)జనవరి 3:** వికసిత్ భరత్ గ్యారెంటీ పర్ రోజ్ గార్ అజీవిక మిషన్ 2025 యాక్ట్‌పై సోమవారం అన్ని గ్రామ పంచాయతీలలో అవగహన గ్రామసభ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరావు శాస్త్రి తెలిపారు.ఈ గ్రామ సభకు గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, ఉపాధి కూలీలు, అన్ని శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ వై. నాగేశ్వర్ శాస్త్రి తెలియజేశారు.

## కర్ణాటకకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

ఎస్సై శోభారాణి ..

**అగళి(తెలుగోడు), జనవరి 3 :** మండల పరిధిలోని ఇరిగేపల్లి గ్రామం సువర్ణముఖి వంక నుంచి శనివారం అక్రమంగా ఇసుకను కర్ణాటకకు తరలిస్తున్న ట్రాక్టర్ ను ఏఎస్ఐ బషీర్ పట్టుకున్నారని దీంతో ట్రాక్టర్ ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శోభారాణి తెలిపారు. సువర్ణముఖి వంకలో ఇష్టానుసారంగా ట్రాక్టర్లో ఇసుకను లోడ్ చేస్తూ కర్ణాటక రాష్ట్రం కార్పేపల్లి కి రవాణా చేస్తున్న ట్రాక్టర్ను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసి ఉంచారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను కర్ణాటకకు తరలిస్తే ట్రాక్టర్ యజమానులు,డ్రైవర్ల పై చర్యలు తీసుకుంటామని ఎస్సై శోభారాణి హెచ్చరించారు.కావున సువర్ణముఖి వంకలో జెసిబి లతో గాని ట్రాక్టర్లతో గాని ఇసుకను తోడుకొని కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తే అట్టివారిపై గ్రామస్తులు పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శోభారాణి కోరారు.



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

## కాశిరెడ్డినాయన ఆశ్రమానికి భక్తుల సహకారం

### ఆలయ అభివృద్ధి, నిత్య అన్నదానానికి విరాళాలు.. భక్తిసేవా సంకల్పానికి విశేష స్పందన..

**ముదిగుబ్బ(తెలుగోడు) జనవరి 3:** ముదిగుబ్బ మండల కేంద్రంలో ఉన్న పవిత్ర కాశిరెడ్డి నాయన ఆశ్రమం అభివృద్ధి కార్యక్రమాలకు భక్తులు, దాతలు గణనీయమైన స్పందన చూపుతున్నారు. ఆశ్రమాన్ని ఆధ్యాత్మిక సేవా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో శనివారం పలువురు దాతలు విరాళాలను కమిటీ అధ్యక్షులు ముత్తులూరు వెంకటేష్‌కు అందజేసినట్లు వేలూరు బాలనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పరిధిలో కాశిరెడ్డి నాయన ఆలయ నిర్మాణం, భక్తులకు అవసరమైన వసతుల కల్పన, నిత్య అన్నదానం వంటి పవిత్ర కార్యక్రమాల నిర్వహణకు ఈ విరాళాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సేవా భావంతో ముందుకు వచ్చిన దాతల సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్ఎస్పి కొట్టాలకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు చినగాని శివ యాదవ్ రూ.10,000, దామానుపల్లి బాలనారాయణ రూ.70,000 విరాళంగా అందజేశారు. పాతఊరికి చెందిన ముత్తులూరు వెంకటేష్ రూ.50,000 విరాళం సమర్పించారు. అలాగే విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరమణప్ప జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు రూ.20,000, పెల్ల నారాయణస్వామి రూ.5,000 అందజేశారు. నిత్య అన్నదానం దిశగా



ఆలయ కమిటీ సభ్యులకు విరాళాలు అందిస్తున్న దృశ్యం

కమిటీ సంకల్పం ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చల్లారంగయ్య, శివయ్య మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసి ఆశ్రమంలో నిత్య అన్నదానం నిరంతరంగా నిర్వహించడమే కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భక్తులు, దాతలు మరింతగా ముందుకు వచ్చి ఆశ్రమ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆధ్యాత్మిక సేవలకు కేంద్రంగా ఆశ్రమం కాశిరెడ్డి నాయన ఆశ్రమం భక్తుల ఆధ్యాత్మిక శ్రేయస్సుతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రధాన కేంద్రంగా రూపుదిద్దుకోవాలని, దాతల సహకారంతో ఈ పవిత్ర కార్యాలు నిరంతరం కొనసాగాలని మండల వాసులు ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారు.



.శ్రీ బనశంకరి దేవికి పూలతో అలంకరణ. అమ్మవారి ఆశీర్వాదం పొందిన ముత్తైదువులు. శ్రీ బనశంకరి దేవి పూజల్లో పాల్గొన్న మహిళలు

## వైభవంగా శ్రీ బనశంకరిదేవి వార్షికోత్సవ వేడుకలు

**అమరాపురం(తెలుగోడు) జనవరి 3:** మండల పరిధిలోని హలుకూరు గ్రామంలో శ్రీ బనశంకరి దేవి 20వ వార్షికోత్సవ వేడుకలను పుష్యమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా శనివారం వైభవంగా శ్రీ బనశంకరి దేవి యువక సంఘం మరియు గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించారు. గంగాపూజ,, గణపతి పూజ, కార్యక్రమం తో పాటు శ్రీ పనశంకరిదేవికి విశేష పూజలు అర్చనలను శ్రీ బనశంకరిదేవి యువక సంఘం ఆధ్వర్యంలో శ్రీ బనశంకరి దేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమ అర్చనలతోపాటు విశేష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా శ్రీ బనశంకరి దేవి మందిరం నందు బనశంకరి దేవికి అభిషేకం విశేష పూజలను వేద పండితులచే వైభవంగా నిర్వహించినారు.



శ్రీ బనశంకరి దేవికి పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

మహిళల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహా మంగళహారతి అనంతరం తీర్థ ప్రసాదం అందజేసి పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ బనశంకరి దేవికి ముత్తైదువులు విశేష పూజలు నిర్వహించి. అమ్మవారి ఆశీర్వాదం పొందారు..రాత్రి శ్రీదేవి మహత్యం అనే పౌరాణిక నాటకంను ఆ గ్రామంలోని కళాకారులు భక్తి శ్రద్ధలతో అభినయించారు. ఈ కార్యక్రమంలో 12 మంది కైవాడస్తులు మరియు హలుకూరు గ్రామపంచాయతీ ప్రజలు, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాయితీపై విత్తన వేరుశనగ పంపిణీ

### రబి సాగుకు అవసరం ఉన్న రైతన్నలు తీసుకెళ్లండి.. మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్..

**నల్లమాడ(తెలుగోడు), జనవరి 3:** మండలంలో రబీ సాగుకి విత్తన వేరుశనగ అవసరమైతే తీసుకెళ్లాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ పిలుపునిచ్చారు. శనివారం నల్లమాడలోని రైతు సేవా కేంద్రంలో పలువురు రైతన్నలకు టిడిపి శ్రేణులతో కలిసి రాయితీపై విత్తన వేరుశనగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



రైతన్నలకు రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్.



రైతన్నలకు రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్.

ఏవో మాట్లాడుతూ 30 కిలోల బస్తా పై 40 శాతం రాయితీని ప్రభుత్వం భరించగా మిగిలిన రూ 1630 చెల్లించి రైతులు తీసుకెళ్లొచ్చు అన్నారు. పట్టాదారు పాస్ బుక్, ఆధార్లతో ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కే సిక్స్ రకం విత్తన వేరుశనగ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ అందుబాటులో ఉంచామన్నారు. ప్రస్తుతం ప్రతి రైతు సేవ కేంద్రంలో 15 క్వింటాళ్ల వరకు నిల్వ చేసామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన కే సిక్స్ విత్తన వేరుశనగను పంపిణీ చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అబ్బాస్ ఖాన్, గెన్ రెడ్డి, చాంప్లా నాయక్, చిట్టి బాల రాజారెడ్డి, బుట్టి నాగభూషణం తదితర నాయకులు రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపిలో చేరిన 20 వైకాపా కుటుంబాలు

### పసుపు కండువా కప్పి ఆహ్వానించిన రాష్ట ఉపాధ్యక్షులు గుండుమల ..

**అమరాపురం(తెలుగోడు), జనవరి 3:** అమరాపురం మండలం హల్కూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కరియప్ప, లింగప్ప కదిరప్ప, సురేష్, వీరితోపాటు 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి పసుపు కండువా కప్పి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం నాయకులందరూ కలిసి కట్టుగా పనిచేయాలని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలిచే విధంగా అందరూ సమన్వయం చేసుకొని కృషి చేయాలన్నారు.



హల్కూర్ గ్రామ వైసీపీ నాయకులకు పసుపు కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి



దేశం పార్టీలో చేరిన హల్కూర్ గ్రామానికి చెందిన వైసిపి 20 కుటుంబాలు

కూటమి ప్రభుత్వంలో మడకశిర నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టిడిపిలో చేరినట్లు వారు తెలిపారు. త్వరలోనే అమరాపురం మండలానికి సాగునీరు అందిస్తున్నారని గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని అందువల్ల తెలుగుదేశం పార్టీలో ఉంటే గుర్తింపు వస్తుందని ఇన్ని రోజులు వైసిపి పార్టీలో పనిచేసిన జగన్మోహన్ రెడ్డి స్థానిక వైసీపీ నాయకులు గుర్తించలేక పోయారన్నారు. మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి బలమైన నాయకత్వం ఉండడంవల్ల వారితో కలిసి పనిచేయాలని సదుద్దేశంతో తెలుగుదేశం పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణమూర్తి, క్లస్టర్ ఇంచార్జ్ రాజు, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారుతి,ప్రకాష్, శ్రీనివాస్, నాగరాజు , నాగరాజు,రఘు, ఓంకార్ ,వివేక్ ,నాయక్ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న సిఆర్ఎంటిలు

## మంత్రి లోకేష్ దృష్టికి సిఆర్ఎంటిల సమస్యలు

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ..

**బత్తలపల్లి(తెలుగోడు), జనవరి 3:** విద్యాశాఖ, సమగ్ర శిక్ష విభాగాల్లో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిగా ఈ అంశాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హామీనిచ్చినట్లు సంఘం నాయకులు వెంకటరమణ, భాస్కర్ నాయుడు, బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఏపీ సి ఆర్ ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని శనివారం కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వెంకటరమణ, భాస్కర్నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రతిపాదిస్తున్న ఏ,బి క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, ఆరేళ్లగా పెరగని జీతాలను ప్రభుత్వ ధరలకు అనుగుణంగా పెంచాలని కోరారు. అలాగే 62 ఏళ్ల పదవి విమర్శ మినిమం టైం స్కేల్, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని విన్నవించారు. బాధితుల విన్నపం పై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ, ఈ అంశాలను త్వరలోనే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని భరోసానిచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహమూర్తి, రమణ,నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నాపత్రాలు పరిశీలించిన ఎంఇఓ శ్రీధర్




ప్రశ్న పత్రాలను పరిశీలిస్తున్న ఎంఇఓ శ్రీధర్

**రోళ్ల(తెలుగోడు), జనవరి 3 :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోళ్ళలో భద్రపరచినఎఫ్ ఎ - 3 ప్రశ్నా పత్రములను మండల విద్యాశాఖ అధికారి ఎస్ఎన్ శ్రీధర్ శనివారం పరిశీలించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన 1 నుండి 10 తరగతుల విద్యార్థులకు ఎఫ్ ఎ -3 పరీక్షలు 05 నుంచి జరగనున్నాయాని పేర్కొన్న ఉత్తర్వుల ప్రకారం నిర్వహించాలని తెలియజేసారు. ప్రాథమిక పాఠశాలల కు 05 న తెలుగు ,గణితము,06 న న ఆంగ్లము, పరిసరాల విజ్ఞానం అదేవిధంగా ఉన్నత పాఠశాలలకు 05 న తెలుగు, గణితము 06 న హిందీ,సైన్స్ 07 న న ఆంగ్లము సాంఘిక శాస్త్రము 08 న జీవశాస్త్రము ప్రకారము పరీక్షలు నిర్వహించాలన్నారు.1 నుండి 5 తరగతుల పరీక్ష ప్రశ్న పత్రాలను క్లస్టర్ పాఠశాల నుండి ప్రతిరోజు పరీక్షకు ఒక గంట ముందుగా కాంప్లెక్స్ పాఠశాల నుండి తీసుకొని వెళ్ళాలి అలాగే 6 నుండి 10తరగతుల ప్రశ్న పత్రాలను ప్రతి సెషన్‌లో పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందు మాత్రమే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రశ్నాపత్రాల బండిల్‌లను ఎం ఆర్ సి నుండి తీసుకొని వెళ్ళాలన్నారు.కావున పై సూచనలను అనురించి పరీక్షలను ఎటువంటి పొరపాట్లు లేకుండా పరీక్షలను చాలా పకడ్బందీగా షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని తెలియజేసారు.అలాగే ప్రశ్నా పత్రాలను కానీ సమాధానములను గాని వాట్సాప్ లేదా ఇత రు సోషల్ మీడియాలో పంపినట్లయితే అటువంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## సీఐపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

చినగాని నరసింహ యాదవ్..



**ముదిగుబ్బ(తెలుగోడు) జనవరి 3:** అనంతపురం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌పై జరిగిన దౌర్జన్యం, బెదిరింపుల ఘటన పట్ల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చినగాని నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. అనంతపురం జెడ్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అనధికార వ్యక్తులు బయటకు వెళ్లాలని సీఐ సూచించగా, దీనికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ టీడీపీ నేత మైసూరారెడ్డి అనుచితంగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వ విధుల్లో ఉన్న అధికారులపై ఈ తరహా ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఘటనపై తక్షణమే విచారణ జరిపి మైసూరారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పార్టీ పరంగా కూడా క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

## అణగారిన వర్గాల విద్యా ప్రదాత సావిత్రిబాయి పూలే

సావిత్రిబాయి పూలే పోరాట స్ఫూర్తిని నేటితరం అందిపుచ్చుకోవాలి.. ప్రజా సంఘాల నాయకులు..

**బత్తలపల్లి(తెలుగోడు), జనవరి 3 :** దేశంలో మహిళ విద్యకు నాంది పలికిన విప్లవ వనిత సావిత్రిబాయి పూలే అని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా ఎస్సీ జన సంఘం, బహు సమాజ్ పార్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీసీ నాయకుడు పామల రమేష్ మాట్లాడుతూ, అంటరానితనం, లింగ వివక్ష రాజ్యమేలుతున్న రోజుల్లోనే సావిత్రిబాయి పూలే విద్య అనే ఆయుధంతో సమాజంలో మార్పు తెచ్చారని కొనియాడారు. ఆడపిల్లల చదువు కోసం ఆమె పడిన శ్రమ వెలకట్టలేనిదని అన్నారు. అనంతరం ఎస్సీ జన సంఘం రాష్ట్ర ఇంచార్జ్ మాల్యవంతం రాంప్రసాద్ మాట్లాడుతూ, ఆమె ఆశయాలను నేటి తరం అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. బీఎస్పీ ధర్మవరం ఇన్చార్జి సాకే వినయ్ కుమార్ మాట్లాడుతూ.. దళితులు, బీసీలు, విద్యావంతులైనప్పుడే నిజమైన విముక్తి లభిస్తుందని, సావిత్రిబాయి పూలే ఆశయ సాధనే ఆమెకు ఇచ్చే నిజమైన నివాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జన సంఘం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ఇంచార్జ్ సాకే కుళ్లాయప్ప, నల్లప్ప, మోహన్, శీను, విజయ్, సాకే హరి, పురుషోత్తం, నాగేంద్ర, బాబు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

# సీపీఐ శత వసంతాల వేడుకలను జయప్రదం చేయండి

**సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య**

**పెద్దకడబూరు(తెలుగోడు), జనవరి 3:**
సీపీఐ శత వసంతాల వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. శనివారం పెద్దకడబూరు గ్రామంలోని సీపీఐ కార్యాలయం నందు ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి వీరేష్ అధ్యకతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి మునెప్ప, కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ లో ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. నేడు ప్రమాదకర పరిస్థితుల్లో శ్రామిక వర్గ ప్రయోజనాలను పరిరక్షించేందుకు కమ్యూనిస్టులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కమ్యూనిస్టులు సిద్ధం కావాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా మహిళలకు 1500 రూపాయలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద 3000 రూపాయలు, నిరుపేదలకు మూడు సెంట్లు స్థలం ఇవ్వడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా 20 వేల రూపాయలు, ఉల్లి రైతులకు హెక్టార్ కు 50 వేల రూపాయలు ఇస్తామని అబద్ధాలు చెప్పి అధికారంలోకి రావడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందని ఆరోపించారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే సీపీఐ శత జయంతి వేడుకలకు లక్షలాది మంది పాల్గొంటారని తెలిపారు. కావున మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ, సీపీఐ మండల సహాయ కార్యదర్శులు కుమ్మరి చంద్ర, తిక్కన్న, నాయకులు నాగరాజు, వీరేష్, హుస్సేన్ బాషా, గోపాల్, సర్దార్ పటేల్, హనుమంతు, కమిటీ సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**ఎస్టీయు డిమాండ్**

**పెద్దకడబూరు(తెలుగోడు), జనవరి 3:**
పెద్దకడబూరు గ్రామంలోని ఎమ్మార్సీ భవనం నందు శనివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 2026 సంవత్సరపు నూతన క్యాలండర్ ను మండల విద్యాశాఖ అధికారులు ఉస్మాన్ బాషా, రామ్మూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర పూర్వపు ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో పోరుబాట పట్టక తప్పదని హెచ్చరించారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలని, బోధనేతర పనులు తగ్గించి ఉపాధ్యాయులపై ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులను పూలమాలలు వేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, ఈరేశ్ రాజు, నాయకులు ప్రభాకర్, రంజాన్, దామోదర్, బీరప్ప, తిరుమలేష్, ఈరన్న, నారాయణరావు, రామాంజనేయులు, వీరేష్, రాజశేఖర్, మహేష్, దినేష్, లక్ష్మయ్య, విజయ్ కుమార్ గౌడ్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు




జెడ్పీ పాఠశాలలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

# ఉపాధ్యాయులందరికీ సావిత్రి బాయి పూలే జీవితం ఆదర్శప్రాయం

**ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు**

**పెద్దకడబూరు(తెలుగోడు), జనవరి 3:**
ఉపాధ్యాయులందరికీ సావిత్రి బాయి పూలే జీవితం ఆదర్శప్రాయమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కౌలన్న, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివకుమార్, ప్రశాంత్ భూపాల్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి విల్సన్ స్పష్టం చేశారు. శనివారం పెద్దకడబూరు గ్రామంలోని కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపల్ రుక్సానా పర్వీన్ అధ్యక్షతన యుటిఎఫ్ ఆధ్వర్యంలో, జెడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాజేశ్వరమ్మ అధ్యక్షతన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేరు వేరుగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని ప్రశంసించారు. తీవ్ర కరువు సంభవించినప్పుడు సావిత్రి బాయి పూలే 2000 మంది విద్యార్థులకు భోజన వసతితో కూడిన విద్యను అందించారని కొనియాడారు. ఉపాధ్యాయినిగా ఆమె చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. ఉపాధ్యాయులందరూ సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకుని పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



కెజిబీవీలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



అశేష భక్తవాహిణి నడుమ శ్రీ చౌడేశ్వరి దేవి రథోత్సవం. శ్రీ చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి. టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ గ్రామ నాయకులు

# రమణీయం శ్రీ చౌడేశ్వరి దేవి రథోత్సవం

**పెద్దకడబూరు(తెలుగోడు), జనవరి 3:**
పెద్దకడబూరు మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి రథోత్సవం శనివారం అశేష భక్తవాహిణి నడుమ కన్నుల పండుగగా జరిగింది. అమ్మవారి రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు అటక చంద్ర శ్రీ చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆకుపూజ, కుంకుమార్చన, బిల్వార్చన, పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి రథాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం ఆలయ పూజారి అటక చంద్ర ఇంటి నుండి కలసం, కుంభంతో ఊరేగింపుగా రథం వద్దకు తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ చౌడేశ్వరి దేవి ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించిన రథంపై ప్రతిష్టించి అశేష భక్తవాహిణి నడుమ రథోత్సవం రమణీయంగా సాగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి శ్రీ చౌడేశ్వరి దేవి రథోత్సవాన్ని తిలకించి పునీతులయ్యారు. పలువురు నేతలు శ్రీ చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలుహనుమాపురంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి రథోత్సవాన్ని పురస్కరించుకొని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. మంచాల సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున, టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపు శ్రీ చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు



రథోత్సవానికి హాజరైన వైసీపీ నాయకులు. వైసీపీ నేతలను గజమాలతో సన్మానిస్తున్న వైసీపీ గ్రామ నాయకులు

తీర్చుకున్నారు. అలాగే గ్రామ సర్పంచ్ పూజారి ఇందిరమ్మ, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, వైసీపీ సీనియర్ నాయకులు కోతి పెద్దయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తనయుడు, వైసీపీ యువనేత వై. ధరణీరెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి, ఎమ్మిగనూరు వైసీపీ సీనియర్ నాయకులు రుద్రగౌడ్, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి శివరామరెడ్డి, పెద్దకడబూరు గ్రామ సర్పంచ్ రామాంజనేయులు శ్రీ చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో శాంతి, సామరస్యం నెలకొనేలా చూడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.

రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనేత రాజారెడ్డి, టీడీపీ నాయకులు బీపీ ఈరన్న, రాజశేఖర్, రంగన్న, పెద్దయ్య, శ్రేషాద్రి, చిన్నతుంబళం సొసైటీ అధ్యక్షులు కందనాతి నరసప్ప, టీడీపీ సీనియర్ నాయకులు హనుమంతరెడ్డి, ఆర్టీఎస్ తాలూకా కన్వీనర్ దశరథ రాముడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ గోనుమాను నరసన్న, బూత్ యూనిట్ ఇన్ చార్జ్ తలారి అంజీ, వైసీపీ నాయకులు పూజారి రాఘవేంద్ర, పూజారి చిన్న ఈరన్న, కొండమీద యల్లప్ప, దుబ్బ యల్లప్ప, జయకృష్ణ, బాలకృష్ణ, వైసీపీ ప్రచార విభాగం తాలూకా అధ్యక్షులు ముక్కరన్న, వైసీపీ వాలెంటీర్ విభాగం తాలూకా అధ్యక్షులు జాము వీరేష్, వైసీపీ విద్యార్థి విభాగం తాలూకా అధ్యక్షులు దయ్యాల మహబూబ్, వైసీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొగ్గుల అర్లప్ప, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీ చౌడేశ్వరి దేవి రథోత్సవానికి హాజరైన టీడీపీ నాయకులు. టీడీపీ నాయకులను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ గ్రామ నాయకులు.
శ్రీ చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

# నూనెగింజల సాగు అభివృద్ధికి రైతులు ముందుకు రావాలి

**పెద్దకడబూరు(తెలుగోడు), జనవరి 3:**
జిల్లాలో నూనెగింజల సాగుకు అనుకూలమైన విస్తారమైన భూములు ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకొని క్రమేపీ నూనెగింజల సాగును పెంచేందుకు రైతులు ముందుకు రావాలని భారతీయ నూనెగింజల అభివృద్ధి సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డా. దుర్గాప్రసాద్, డా. లక్ష్మమ్మ, డా. సురేశ్ తెలిపారు. పెద్దకడబూరు మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న కుసుమ పంటను శనివారం వారు బనవాసి కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని నేలలు మరియు వాతావరణ పరిస్థితులు కుసుమ, ప్రొద్దుతిరుగుడు, ఆముదం వంటి నూనెగింజల పంటల సాగుకు అత్యంత అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. నూనెగింజల సాగు విస్తీర్ణాన్ని పెంచడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడంతోపాటు దేశంలో నూనెగింజల ఉత్పత్తి పెరుగుతుందని వారు తెలిపారు. ఈ దిశగా భారతీయ నూనెగింజల అభివృద్ధి సంస్థ రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం, మార్గదర్శకత్వం అందిస్తూ నూనెగింజల సాగు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అలాగే నూనెగింజల సాగుకు అవసరమైన రాయితీలు, ప్రోత్సాహకాలు అందించేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ముఖ్యంగా కుసుమ సాగుకు ముందుకు వచ్చే రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఉచితంగా అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డా. రాఘవేంద్ర చౌదరి



కుసుమ పంటలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడి విధానాన్ని అనుసరించి నూనెగింజల పంటలను సాగు చేయడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతోపాటు మంచి దిగుబడులు సాధించవచ్చునని సూచించారు. అదనంగా కర్నూలు జిల్లాలో భారతీయ నూనెగింజల అభివృద్ధి సంస్థ షెడ్యూల్ కులాల ఉపప్రణాళిక కింద ఐఎస్ఎఫ్ – 764 కుసుమ రకాన్ని సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో అల్వాల, పెసలదిన్నె, పెద్దకడబూరు గ్రామాల్లో సాగు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రదర్శనల ద్వారా రైతుల్లో మంచి స్పందన లభించిందని, వచ్చే సంవత్సరంలో ఈ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.




పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి, నూనెగింజల సాగులో సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త

# పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి




మండల పరిషత్ కార్యాలయం వెళ్లే రహదారిలో జేసీబీ ద్వారా పూడిక తీస్తున్న దృశ్యం

**పెద్దకడబూరు(తెలుగోడు), జనవరి 3:**
పెద్దకడబూరు గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ఆదేశించారు. శనివారం పెద్దకడబూరు గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ ప్రభావతి దేవి, గ్రామ సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఉన్న ముళ్ల కంపలను,



మండల పరిషత్ కార్యాలయం వెళ్లే రహదారిలో జేసీబీ ద్వారా పూడిక తీస్తున్న దృశ్యం

డ్రైనేజీలలో ఉన్న పూడికను జేసీబీ ద్వారా శుభ్రం చేయించారు. అలాగే ఆదోని ప్రధాన రహదారిలో ఉన్న పెంటకుప్పలను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసేందుకు కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు దరికి రావన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి సాయితేజ, సొసైటీ ఛైర్మన్ మీ సేవ ఆంజనేయులు, టిడిపి మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి గోనుమాను నరసన్న, టీడీపీ యువ నాయకులు ఇంద్రసేనారెడ్డి, నీలకంఠ రెడ్డి, బొగ్గుల నరసన్న తదితరులు పాల్గొన్నారు.



ఆదోని ప్రధాన రహదారిలో దిబ్బలను తొలగిస్తున్న దృశ్యం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపిడిఓ సుబ్బారెడ్డి

# వి జీ రామ్ జీ ఉపాధి హామీ గ్రామసభల పోస్టర్ల ఆవిష్కరణ

**దువ్వూరు(తెలుగోడు), జనవరి 3 :**

దువ్వూరు మండల కేంద్రంలో వికసిత్ భారత్ మరియు జీ రామ్ జీ గ్రామసభలకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి గ్రామసభల నిర్వహణకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు మరియు పాంప్లెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జనవరి 5వ తేదీన మండలంలోని అన్ని పంచాయతీల్లో 'వికసిత గ్రామపంచాయతీలు, వికసిత భారత్' లక్ష్యంగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం ఈ ప్రచార సామగ్రిని పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లకు పంపిణీ చేసి, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు హరికృష్ణ యాదవ్, ఎం. వెంకటరమణ రెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఈసి ఇందిరా ప్రియాంక, ఉపాధి హామీ పథకం సిబ్బంది మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో అన్నదానం

**ఖాజీపేట(తెలుగోడు), జనవరి 3:**

ఖాజీపేట మండల పరిధిలోని ములపాకు సమీపంలో ఉన్న పునీత లారెన్స్ వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఖాజీపేట మండలం బీసీ కాలనీకి చెందిన ఉదయగిరి మస్తాన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం మస్తాన్ వృద్ధులతో మమేకమై వారి ఆరోగ్యం, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది ముందుకు వచ్చి చేపట్టాలని ఆకాంక్షించారు. మస్తాన్ చేసిన సేవను ఆశ్రమ నిర్వాహకులు అభినందించి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పరిటాల వీరయ్య, ఖాజీపేట సూర్య రిపోర్టర్ బొర్రా శివరామిరెడ్డి, దస్తగిరి, ఉదయగిరి కుళాయి, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్న మస్తాన్

# రబీ పంటల నమోదు పారదర్శకంగా జరగాలి

ఏడీఏ లక్ష్మానాయక్ ..

**బత్తలపల్లి(తెలుగోడు), జనవరి 3:**

రవి సీజన్లో రైతన్నలు సాగు చేసిన ప్రతి పంటను పారదర్శకంగా ఈ పంటలో నమోదు చేయాలని ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మ నాయక్ ఆదేశించారు. శనివారం బత్తలపల్లి మండలంలో పంట నమోదు పురోగతిని మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అందే పరిహారం, ఇన్సూరెన్స్, రాయితీలు పొందాలంటే పంట నమోదు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆర్.బి.కె సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి త్వరతగతిన నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం త్వరలో మార్క్ షెడ్ ద్వారా కందుల కొనుగోలు ప్రారంభించనుందని, క్వింటాల్కు రూ. 8000 మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. కంది సాగుచేసిన రైతులు వెంటనే తమ పేర్లను రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసులు, సిబ్బంది రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



రబి పంటల నమోదును పర్యవేక్షిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్

# కువైట్‌లో అంబరానంటిన ప్రవాసాంధ్రుల ముందస్తు సంక్రాంతి సంబరాలు

## హాజరైన వైసీపీ అగ్రనేతలు..

**అట్లూరు(తెలుగోడు), జనవరి 3:**

కువైట్‌లో ప్రవాసాంధ్రుల రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. జబర్దస్త్ టీం ఈ కార్యక్రమంలో ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. కువైట్‌లోని ప్రవాసాంధ్రుల ప్రత్యేక ఆహ్వానం మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్ సిపి) అగ్ర నేతలు ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి తనయుడు డి.సి. ఆదిత్య రెడ్డి, ముడమాల ప్రభాకర్ రెడ్డి, కరెంట్ రమణారెడ్డి. రొండా మాధవరెడ్డి. ఎన్నారై గ్లోబల్ కన్వీనర్ ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరిని ఎన్నారైలు తరపున రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి



కువైట్‌లో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న వైసీపీ అగ్రనేతలు



కువైట్‌లో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న వైసీపీ అగ్రనేతలు

నాయకుడు కొండ్రెడ్డి పెంచల్ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కువైట్‌లోని వై.యస్.ఆర్. అభిమానులు జగన్ మోహన్ రెడ్డి . అభిమానులు వైయస్సార్సీపి పార్టీ అభిమానులు భారీ ఎత్తున సభకు చేరుకొని అభిమానాన్ని చాటుకున్నారు. ఎక్కడ ఏ సమస్య ఎదురైనా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా రెడ్డి సేవా సంఘం ఆదుకుంటుందని. వైఎస్ఆర్సిపి పార్టీకి అండగా నిలుస్తామని ఎన్నారైల ఐక్యత మరింత రెట్టింపు అయిందని వారు తెలిపారు. జబర్దస్త్ టీం కార్యక్రమంలో పెంచల్ రెడ్డి ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాసాంత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో ఇరగం రెడ్డి భాస్కర్ రెడ్డి, గజ్జల నరసారెడ్డి, బోవిల్ల. పిచ్చిరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రెండ్లా రమణారెడ్డి, బోవిల్ల. గోపిరెడ్డి, బోవిల్ల.లక్ష్మీ నర్సారెడ్డి, బుర్రి కృష్ణ యాదవ్. తదితరులు పాల్గొన్నారు,

# అట్టహాసంగా రితీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

**బద్వేల్ (తెలుగోడు) జనవరి 3:**

బద్వేల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తనయుడు యువ నాయకుడు బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ఇంచార్జ్ రితీష్ రెడ్డి రెడ్డిజన్మదిన వేడుకలను అట్లూరులో ఘనంగా నిర్వహించారు. అట్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, తెలుగు యువత అధ్యక్షులు జయ కృష్ణారెడ్డి, యువ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, మాజీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు పొన్నవోలు. సాంబశివారెడ్డి, చిలిపి కృష్ణారెడ్డి, డీలర్ గంగిరెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, బోవిల్ల. నర్సారెడ్డిలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు



కేక్ కోస్తున్న నాయకులు



బాలికలకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేస్తున్న దృశ్యం.
కేక్ కోస్తున్న నాయకులు

పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. రితీష్ రెడ్డి జన్మదిన కేక్ కటింగ్ కు మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా బద్వేల్ రూరల్ సీఐ కృష్ణయ్య,హాజరై మండల నాయకులతో కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు నియోజకవర్గ ఇన్చార్జ్ రితీష్ రెడ్డి కృషి చేస్తున్నార న్నారు. అదేవిధంగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల చైర్మన్ బైరగాని సుబ్బమ్మ భర్త పరమేష్ యాదవ్ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బాలికలకు పండ్లు బ్రెడ్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మీకు నీళ్లు ఇచ్చేందుకే వచ్చా..

## కొర్రకోడు వద్ద వ్యవసాయ కూలీలతో మంత్రి పయ్యావుల కేశవ్ మాటామంతీ..

**బెళుగుప్ప(తెలుగోడు) జనవరి 3:**

రాష్ట్ర ఆర్థిక,ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మహిళా రైతు కూలీలతో ముచ్చటించారు. శనివారం కూడేరు మండలం కొర్రకోడు గ్రామం మీదుగా వెళుతూ మహిళా వ్యవసాయ కూలీలను చూడగానే వెంటనే తన కారు ఆపి కిందకి దిగి.. నేరుగా వెళ్లి వారితో మాట్లాడి మంత్రి తన్మయత్వం చెందారు. మహిళా కూలీల సమస్యలు అడిగి తెలుసుకుని, వారికి తాము అండగా ఉంటామని మంత్రి భరోసాని ఇచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ఎన్ని గంటలకు పనులకు వస్తారు, ఎంతసేపు పని చేస్తారు, మీకు తల్లికి వందనం వస్తోందా, ఎంతమంది పిల్లలకు వచ్చింది, ఈ ప్రభుత్వం ఏం చేస్తే ఇంకా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది, తదితర వివరాలను కూలీలతో మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మా పిల్లలకు తల్లికి వందనం వస్తోందని వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ మీకు నీళ్లు ఇచ్చేందుకే నేను వచ్చానన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పేజ్-2లో భాగంగా రూపొందించి ఆగిపోయిన మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (కమ్యూనిటీ లిఫ్ట్ కమ్ డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్) పనులను గత ప్రభుత్వం వచ్చాక నిలిపివేయడం జరిగిందని, లేకపోతే ఈ పాటికే మీ అందరికీ సాగునీరు వచ్చేదన్నారు. రైతులు, రైతు కూలీలందరూ బాగుండాలని



జయపురం గ్రామం వద్ద టమోటా పండించిన రైతులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఆకాక్షించారు. ఇప్పుడు మాత్రం నీరు ఇచ్చేందుకే వచ్చామని, ప్రతి ఎకరాకు సాగు నీరు ఇవ్వాలనేదే తమ లక్ష్యం అన్నారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో అందించాలని, వాటిని తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. వచ్చే ఆరు నెలలకు అటు ఇటుగా నీరు ఇస్తామని తెలియజేశారు. అనంతరం జయపురం గ్రామం వద్ద టమోటా రైతులతో మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం ధర ఎంత ఉంది, దిగుబడి, ఆదాయం బాగా వచ్చిందా అంటూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు, మహిళా కూలీలు, తదితరులు పాల్గొన్నారు..



కొర్రకోడు గ్రామ సమీపంలో మహిళా వ్యవసాయ కూలీలతో ముచ్చటిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ.ఉమామహేశ్వర్ కుమార్

# ప్రతి ప్రైవేట్ హాస్పిటల్ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ.ఉమామహేశ్వర్ కుమార్

**బద్వేల్(తెలుగోడు), జనవరి 3:**

ప్రతి ప్రైవేట్ హాస్పిటల్ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ.ఉమామహేశ్వర్ కుమార్ అన్నారు. బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని వాసుదేవ హాస్పిటల్, శ్రీరామ డెంటల్ క్లినిక్, ప్రసాద్ డెంటల్ క్లినిక్, శ్రీనివాస హాస్పిటల్‌ను డాక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఏ. ఉమామహేశ్వర్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ రిజిస్ట్రేషన్ నార్స్ ప్రకారం అన్ని వసతులు ఉండేటట్లు చూసుకుని ఫైర్ ఎన్ఓసి,బయోమెడికల్ వేస్టేజ్ మేనేజ్మెంట్, పారామెడికల్ సిబ్బంది అర్హత ల్యాబ్ టెక్నీషియన్ యొక్క అర్హత మరియు ఎక్రే ప్లాంటు ఎక్రే టెక్నీషియన్ అర్హత ఉన్నటువంటి సిబ్బందిని నియమించుకొని హాస్పిటల్లో నిర్వహించాలన్నారు. హాస్పిటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రైవేటు డాక్టర్స్‌కు ఆదేశించడచారు. ప్రైవేట్ హాస్పిటల్ అన్నీ సక్రమంగా లేకపోతే మూసి వేస్తామన్నారు. ప్రతి ల్యాబ్‌ను , హాస్పటల్ పరిసరాలు, ఎక్స్‌రే ప్లాంట్, బయో మెడికల్ వేస్ట్, ఫైర్ ఎన్ ఓ సి పత్రాలను క్షుణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. మల్లేష్, డాక్టర్ జి రాజేష్ కుమార్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ శరత్ చంద్ర, ప్రైవేట్ డాక్టర్స్, పిఓడిటి ఆఫీసు నుండి రమణమ్మ హెచ్,ఇ, ఇ, ఓ, జిల్లా మాస్ మీడియా ఆఫీసు నుండి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మరియకుమారి, బి వెంగయ్య హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, వి శివరాం రెడ్డి,వెంకటేశ్వర్లు హెల్త్ సూపర్వైజర్స్, హెల్త్ అసిస్టెంట్స్ వి.జనార్ధన్ రావు, శ్రీరాములయ్య పాల్గొన్నారు.



రైతులకు పాస్ పుస్తకాలను అందిస్తున్న అధికారులు, నాయకులు

# పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

తహసీల్దార్ సంజీవరెడ్డి..

**దువ్వూరు(తెలుగోడు), జనవరి 3 :**

మండలంలోని గుడిపాడు గ్రామ సచివాలయంలో శనివారం రెండో రోజు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు . మండల తహసీల్దార్ యేమిరెడ్డి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన సరికొత్త పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, రీ-సర్వే మొదటి దశ పూర్తయిన నెలటూరు, చల్లభసాయపల్లె, అన్నపు శాస్త్రి పల్లె, మరియు రామచంద్రాపురం రెవెన్యూ గ్రామాలకు సంబంధించి కొత్త పుస్తకాలు మంజూరయ్యాయని తెలిపారు. రైతులు తమ పాత పాసుపుస్తకాలను అందజేసి, పారదర్శకమైన రికార్డులతో కూడిన నూతన పుస్తకాలను తీసుకోవాలని సూచించారు. ఈ గ్రామసభలు రైతులు తమ భూములకు సంబంధించి శాశ్వత హక్కులు మరియు రికార్డులు పొందేందుకు ఒక గొప్ప వేదిక. పక్కాగా జరిగిన ఈ రీ-సర్వే వల్ల భవిష్యత్తులో భూ తగాదాలు వచ్చే అవకాశం ఉండదు, రైతులు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు" అని ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ వేణుగోపాల్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జాన్సన్, గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. తమ భూములకు అధికారిక ముద్రతో కూడిన కొత్త పుస్తకాలు అందడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.



వాహనదారులకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ధనుంజయుడు, హైవే అధికారులు పునీత లారెన్స్

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

యస్ఐ ధనుంజయుడు ..

**దువ్వూరు(తెలుగోడు), జనవరి 3:**

37వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం దువ్వూరు మండలం ఈడమడక గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై యస్ ఐ ధనుంజయుడు మరియు నేషనల్ హైవే అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులను ఆపి, ప్రయాణంలో పాటించాల్సిన కనీస జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా మరియు కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు . రోడ్డు నిబంధనలపై రూపొందించిన ప్రత్యేక అవగాహన కరపత్రాలను ప్రయాణికులకు అందజేశారు. ఈడమడక పరిసరాల్లో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. రహదారి మలుపులు, సైన్ బోర్డుల ఏర్పాటు మరియు ఇతర సాంకేతిక లోపాలను సరిదిద్దే అంశాలపై చర్చించారు. అతివేగం, అజాగ్రత్త మరియు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు అధికారులు, నేషనల్ హైవే సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో మహాపడిపూజ

**కనేకల్(తెలుగోడు), జనవరి 3:**

కనేకల్ మండల కేంద్రంలో నెలకొని ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో మహా పడిపూజ మహోత్సవం రాపా ప్రకాష్ అభిలాష్, ఆలయ కమిటీ గురుస్వాముల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయం అంత వివిధ రకాల పుష్పాలతో, విద్యుత్ కాంతులతో అలంకారంతో అలంకరించి పుష్పాలంకరణ ప్రత్యేకంగా భక్తులను ఆకర్షించింది 18 మెట్లను ప్రత్యేకంగా అలంకరించి శ్రీ అయ్యప్ప స్వామి వారికి నెయ్యి అభిషేకం పంచామృత అభిషేకం మంత్రపుష్పం మహా మంగళ హారతి నిర్వహించారు. 18 మెట్ల ను అలంకరించి ఒక్కో మెట్టని పడి పాటతో దీపం వెలిగించి మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ గురు స్వాములు తిమ్మప్ప,చిక్కన్న,నాగప్ప, ప్రకాష్ నీ ఆలయ కమిటీ వారు సన్మానించారు. అలాగే కమిటీ అధ్యక్షులు నాగభూషణం, సుబ్రహ్మణ్యం,శేఖర్ రెడ్డి, సుధాకర్, శివయ్య నీ సన్మానించారు. అనంతరం తీర్థ ప్రసాదం శక్తి నీ రాపా అభిషేక్ శక్తి తీర్థ ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో హోటల్ శివ సాయి,శరణ్,ఏకాంబర ప్రసాద్ శాంత వీర వందలాది మంది అయ్యప్ప భక్తులు ప్రజలు పాల్గొన్నారు.



పడిపూజ అలంకరణలో 18 మెట్లు స్వామి . రాపా ప్రకాష్ స్వామిని మరియు ఇతరులను స్వాములను సన్మానిస్తున్న గురు స్వాములు

# ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

**బెళుగుప్ప (తెలుగోడు), జనవరి 3:**

బెళుగుప్ప మండలం పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన షేక్ షబానా (41) కడుపునొప్పి తాళలేక శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గంగవరం గ్రామానికి చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ భార్య షేక్ షబానా గత కొన్ని నెలలుగా కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్ తో బాధపడుతూ నొప్పిని భరించలేక శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు షేక్ షబానా అన్న ఖలందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శివశంకర్ నాయక్ పేర్కొన్నారు.




సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

## ఘనంగా సావిత్రిబాయి పూలే 195వ జయంతి

**గూడూరు(తెలుగోడు), జనవరి 3 :**
మహిళా విద్యకు, సమానత్వానికి బాటలు వేసిన మహనీయురాలు శ్రీమతి సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు గూడూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గూడూరు కార్ స్టాండ్ సమీపంలోని ఆర్ అండ్ బి కార్యాలయం బయట అంగన్వాడీ సూపర్వైజర్ సుజనా గారు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా మణులు, అంగన్వాడీ టీచర్లు, వివిధ ప్రజాసంఘాలు, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, ఎమ్మార్పీఎస్ తదితర పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.సావిత్రిబాయి పూలే వేసిన విద్య పునాదులే నేటి స్త్రీ స్వేచ్ఛకు కారణంఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ180 సంవత్సరాల క్రితమే మహిళలకు చదువు ఆయుధమని నిరూపించిన విద్యావిప్లవకారిణి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కుల, మతాల పేరుతో తరతరాలుగా అణచివేతకు గురైన అట్టడుగు వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అర్ధాంగిగా సావిత్రిబాయి పూలే నిలిచారని తెలిపారు.మహిళలకు సాధికారతకు నిలువెత్తు రూపంగా నిలిచిన ఆమె, భారతదేశంలో మహిళా విద్యకు పెద్దపీట వేస్తూ, అట్టడుగు వర్గాలకు చెందిన బాలికల కోసం పాఠశాలలను స్థాపించారని గుర్తు చేశారు. తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి సత్యశోధక సమాజం స్థాపించి, బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, కుల వివక్షకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడారని అన్నారు.వితంతు పునర్వివాహాల కోసం పోరాడిన ధైర్యవంతురాలువితంతు మహిళల పునర్వివాహానికి మద్దతుగా నిలబడి, సమాజంలో నాటి క్రూర ఆచారాలను ఎదిరించిన ధైర్యశాలిగా సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచిపోయారని వక్తలు పేర్కొన్నారు. ఆమె చూపిన మార్గంలో నడవడమే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు ఆర్. సుజనా, బి. హైమావతిఅంగన్వాడీ టీచర్లు తులసి, శారిరత్నం, ఉమా, సుభాషిణి, విజయలక్ష్మిదస్తగిరి యు. రామకృష్ణారావు, వేమయ్యబీఎస్పీ నాయకులు నాసిన్ భాస్కర్ గౌడ్, ఎల్.వి. సుబ్బయ్య,జి. వెంకటేశ్వర రాజు, ఎస్సీ జమాల్ బాషాఎమ్మార్పీఎస్ నాయకులు వై. శ్రీనివాసులు, ఆదూరి రత్నంనాయి బ్రాహ్మణ సంఘం నాయకులు ఎం. గురునాథం, సీనయ్యగూడూరు సబ్ రిజిస్ట్రార్ యూనియన్ కిషోర్ గాదం వినయ్ కుమార్, మీజురు సుబ్రహ్మణ్యంఆల్ ఇండియా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ యాదవ్ఎం. వెంకటేశ్వర్లు, యాదాల సునీల్, పల్లి కోటేశ్వరరావు వేగూరు విజయ్ కుమార్ పలువురు ప్రజాసంఘాల నాయకులు, మహిళా మణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహనీయురాలైన సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు అర్పించారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలె జయంతి వేడుకలు

**రోళ్ల(తెలుగోడు), జనవరి 3 :**
భారత దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి సందర్బంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ను రొళ్ల మండలం అలుపనపల్లి ఉన్నత పాఠశాల క్లస్టర్ లో ఘనంగా జరుపుకోన్నారు.ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతా మాట్లాడుతూ సావిత్రి బాయి పూలె గారి జీవితం నేటితరానికి ఆదర్శం గా నిలుస్తుందని, ఆమె వల్లనే నేడు బాలికల చదువుకు మార్గదర్శి గా నిలిచిందని తెలిపారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథి గా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి శ్రీ శ్రీధర్ సార్ మాట్లాడుతూ కొన్ని వేల సంవత్సరాలనుండి స్త్రీల పట్ల వివక్ష చూపుతోందని.. క్రీస్తు పూర్వం మనువు రాసిన మనుధర్మ శాస్త్రం స్త్రీ కి ఎలాంటి హుక్కులు లేకుండా కేవలం పురుషులకు బానిసగా ఉండేలా నియమాలు రాసారని... ఈ మనుధర్మ శాస్త్ర నియమాలను అదిగమించిన సావిత్రి బాయి పూలె భర్త సహకారం తో ఉపాధ్యాయ శిక్షణ తీసుకొని శుద్రా, అతిసూద్ర కులాలకు చెందిన బాలికల కోసం పాఠశాల స్థాపించి తానే మొదట ఉపాధ్యాయురాలుగా చేరి భారతదేశం లోనే మొదటి ఉపాధ్యాయురాలుగా చరిత్ర సృష్టించిందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న కాంప్లెక్స్ క్లస్టర్ సెక్రటరీ సుధాకర్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలె ఉపాధ్యాయురాలుగా పిల్లలకు పాఠాలు చెప్పడం నచ్చని అగ్రకుల ఒత్తిడితో మహాత్మా జ్యోతి రావో సావిత్రి బాయి దంపతులను ఇంటినుండి వెళ్లగొడితే తన మిత్రురాలు షేక్ ఫాతిమా అనే ముస్లిం మహిళా తన ఇంటిలో ఆశ్రయం ఇచ్చారని ఆనాడు భారతదేశం లో మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలుగా సావిత్రి బాయి పూలె తో పాటు బాలికల పాఠశాల లో పాఠాలు చెప్పిన షేక్ ఫాతిమా తన గొప్ప సేవలను నేడు గుర్తించవలసిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమం లో మహిళా ఉపాధ్యాయుల సేవలను గుర్తించి క్లస్టర్ ఉపాధ్యాయులకు ఆత్మీయ సత్కారం చేసారు. ఈ కార్యక్రమం లో క్లస్టర్ లోని కాకి ఉన్నత పాఠశాల, రత్నగిరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, క్లస్టర్ లోని పాఠశాలల ఉపాధ్యాయులు అయిన నీరజ, పద్మ, నేత్రవతి, శోభ, ఉషారాణి, సాయికీర్తి, రోజావతి, కోమాల, సమారిన్, సిఆర్పిలు రత్నమ్మ, చిత్ర, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఓ శ్రీధర్
ఉపాధ్యాయినులకు బహుమతులు అందిస్తున్న ఎంఇఓ శ్రీధర్

## ఘనంగా సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు

**రోళ్ల(తెలుగోడు), జనవరి 3 :**
మడకశిర మండలం టి.డి.పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కే. భూతన్న అధ్యక్షతన భారత దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే. భూతన్న మాట్లాడుతూ మహిళలు, దళితులు, శుద్రులు, అతిశూద్రులు చదువుకోకూడదని కఠినమైన సామాజిక ఆంక్షలతో కొట్టుమిట్టాడుతున్న భారత సమాజాన్ని విద్య ద్వారానే ఛేదించవచ్చని నమ్మి అనేక పాఠశాలలను ప్రారంభించి చదువుల తల్లిగా కీర్తించబడిన మొదటి సాంఘిక విప్లవ కారిణి ,తన ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాక సమాజ మార్పునకు శక్తివంతమైన సాధనంగా భావిస్తూ, బాలిక విద్యను ధైర్యంగా ముందుకు నడిచిన ధీశాలి. మహిళా సాధికారిక సంస్థ సత్యశోధక సమాజం ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన నిత్య స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. తదనంతరం పాఠశాలలో పనిచేసే మహిళా ఉపాధ్యాయులు సరిత, చైతన్య, ముబీనా టీచర్స్ కు పూల మాలలు,శాలువాతో పాఠశాల టీచర్స్ ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాష్,సీపీ రవీంద్ర, గవ్వల రామకృష్ణ, కరణం రఘునాథరావు పరమేశ్వర్ పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఉపాధ్యాయులు
సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు కె. భూతన్న

# రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### ఏఎస్ పేటలో పండుగ వాతావరణంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ .. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి..

**ఆత్మకూరు(తెలుగోడు), జనవరి 3 :**
రైతును రాజుగా చూడాలనే దృఢ సంకల్పంతో ఎన్డీఎ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. శనివారం ఉదయం ఏఎస్పేట మండలం హసనాపురం గ్రామంలో రైతుల ఆనందోత్సాహాల నడుమ ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అధికారులతో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రైతుల ఇంటి వద్దకే వెళ్లి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, “మీ భూమి మీ హక్కు” కార్యక్రమం ద్వారా రైతులకు సంపూర్ణ భూ యాజమాన్య హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని చెప్పారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, గత ప్రభుత్వం గత ముఖ్యమంత్రి ఫోటోలతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దు చేసి, ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాలను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. అధికారం చేపట్టిన తొలి క్యాబినెట్ సమావేశంలోనే రైతులకు నష్టం కలిగించేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ను రద్దు చేశామని గుర్తు చేశారు.గత ప్రభుత్వం కోటి మంది రైతుల భూములకు వారి హక్కులు లేకుండా చేసే విధంగా పనికిరాని పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించేందుకు ప్రయత్నించిందని, ఎన్నికలకు మూడు నెలల ముందే ఈ దుర్మార్గపు ఆలోచనతో 35 లక్షల


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రైతుల పాస్ పుస్తకాలను మార్చేశారని విమర్శించారు.దొంగ నోటు లాంటి పాత పాస్ పుస్తకాల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.రాష్ట్ర మొత్తం మీద 7200 గ్రామాల్లో గత ప్రభుత్వం 23 లక్షల పట్టాలు పంపిణీ చేసిందని, మరో 12 లక్షల పట్టాలను తెలిపారు.నెల్లూరు జిల్లాలోని 235 గ్రామాల్లో 1.05 లక్షల మందికి పైగా రైతులకు గత ప్రభుత్వం జగన్ ఫోటోతో కూడిన పాస్ పుస్తకాలను పంపిణీ చేసిందని, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 13 గ్రామాల్లో 5,486 పట్టాలను అందించారని తెలిపారు. వాటి స్థానంలో నేడు ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్తో కూడిన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నూతన పాస్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రతి నెల 1 నుంచి 7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, ప్రతి నెల 9వ తేదీన ఏదో ఒక గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా హాజరై పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారని మంత్రి తెలిపారు.పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఎలాంటి చిన్న తప్పు ఉన్నా వెంటనే సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. “రైతుకు అన్నం పెట్టే భూమికి రైతును రాజుగా చేయడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం” అని స్పష్టం చేశారు.రీ-సర్వే పేరుతో గత ప్రభుత్వం భూముల సర్వేలో కూడా హద్దురాళ్లపై జగన్ ఫోటోలు ముద్రించి రూ.650 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిచేస్తూ సుపరిపాలన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. 2026 డిసెంబర్ చివరి నాటికి రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలకు, రైతులకు అండగా నిలుస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, తహశీల్దార్ అనిల్కుమార్, స్థానిక నాయకులు రమేష్నాయుడు, సుధాకర్రెడ్డి, రవీంద్రారెడ్డి, గిరినాయుడు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.


రైతులకు పాసు పుస్తకాలు అందిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళకు కుట్టు మిషన్ అందిస్తున్న దృశ్యం

## ప్రగతి సేవా సంస్థ వారోత్సవాలు

**గూడూరు(తెలుగోడు), జనవరి 3 :**
ప్రగతి సేవా సంస్థ,గూడూరు 2026 జనవరి 12వ తేది మన సంస్థ 6వ వార్షికోత్సవం సందర్భంగా జనవరి 1వ తేది నుంచి 12వ తేది వరకు ప్రగతి వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడును.ఈ వారోత్సవాలలో భాగంగా 03- 01- 2026వ తేదిన శనివారం ఉదయం 10:30 గంటలకు గూడూరు లోని బాలాజీ నగర్ లో ప్రగతి ఆఫీస్ నందు గాంధీనగర్ కి చెందిన వరలక్ష్మి ఒక మహిళకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో కుట్టు మెషీన్ను ప్రగతి కుటుంబ సభ్యుడు గదిరాజు రాజశేఖర్ వర్మ సహకారంతో అందించారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు కేవలం గృహిణులు గానే కాకుండా తమ కాళ్ళ మీద తాము నిలబడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం కుట్టుమిషన్ కేవలం ఒక యంత్రం మాత్రమే కాదని అది ఒక కుటుంబానికి ఉపాధి కల్పించే ఆయుధ మని,ఆయన పేర్కొన్నారు భవిష్యత్తులో మరెన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి సాయం అందిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు ప్రగతి కుటుంబ సభ్యులు మురళి నాయుడు విఎంసి మెంబర్ వెంకటేశ్వర్లు వాట్సాప్ రాము కుమార్ నాయుడు శ్యామ్ కె ఆర్ ఎం కృష్ణారెడ్డి వాకాటి శ్రీనివాసులు వెంకట్రావు నాగేంద్ర విజయ్ తదితరులు పాల్గొన్నారు.


తల్లపనేని వెంకట మంజునాథ్ను అభినందిస్తున్న నాయకులు

# రీ సర్వే కార్యక్రమంపై అవగాహన

### తహసీల్దార్ హేమంత్ కుమార్ .. యువనేత మారినేని రామకృష్ణ ..

**వరికుంటపాడు(తెలుగోడు), జనవరి 3 :**
వరికుంటపాడు మండలంలోని తూర్పు రొంపి దొడ్ల గ్రామంలో శనివారం రీ సర్వే పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ హేమంత్ కుమార్, తెలుగుదేశం పార్టీ యువనేత మారినేని రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మల్లంపాటి సుబ్బారావు గొళ్ళ తిరుపతయ్య పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాల ద్వారా గ్రామంలోని రైతులకు సంబంధించినటువంటి ప్రతి ఒక్కరి భూమిని సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. విఆర్ఓ సర్వేర్లు ఆధ్వర్యంలో జరిగే రీ సర్వే కార్యక్రమంలో రైతులు తమకు సంబంధించినటువంటి పొలం దస్త్రాలు విఆర్ఓ కు అందించాలని అన్నారు. వారసత్వంగా వచ్చిన భూములు అలాగే ప్రభుత్వం అసైన్మెంట్ ఇచ్చినటువంటి భూములు ఇలా అన్ని రకాల భూములు రీ సర్వే చేసి రైతులకు పూర్తిస్థాయి హక్కులను కల్పిస్తూ భూ సమస్యలు లేనటువంటి గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే కార్యక్రమం గత ప్రభుత్వం తీసుకొని వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తూ గ్రామాలలో భూ సమస్యలు పూర్తిగా నిర్మూలించడానికి ఈ కార్యక్రమం కొనసాగిస్తుందని అందువలన రైతులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా యువ నేత మారినేని రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీసర్వే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో భూ సమస్యలు లేనటువంటి గ్రామంగా తీర్చిదిద్దడానికి, రైతులకు తమకు సంబంధించినటువంటి భూములు హద్దుల్లో సమస్యలు లేకుండా రికార్డు నమోదులో సమస్యలు లేకుండా తీర్చిదిద్దడం కోసం రీ సర్వే ప్రాజెక్టును కొనసాగిస్తూ ప్రస్తుతం మన గ్రామం రిసర్వే కింద ప్రాధాన్యత కల్పిస్తూ చర్యలు తీసుకోవడం జరిగిందని అందువలన గ్రామంలోని ప్రజలు రైతులు తమ భూములు యొక్క హక్కులు పూర్తిస్థాయిలో రికార్డులు నమోదు హద్దులు వంటివి తేడాలను



రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సవరించుకొని లబ్ధి పొందాల్సిందిగా కోరారు. ఎవరికైనా ఎటువంటి సందేహాలు ఉన్న స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులను, లేదా అధికారులను సంప్రదించి రైతులు యొక్క భూములకు సంబంధించినటువంటి పూర్తిహక్కులు పొందవలసిందిగా తెలియజేశారు. అలాగే గ్రామంలోని ప్రజలు ప్రతి సమస్యకు కార్యాలయం చుట్టూ తిరగాలంటే పని పోగొట్టుకొని తిరగటం కొంచెం ఇబ్బందిగా ఉండిద్దని అందువలన తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరైనా ప్రజా సమస్యల పైన వచ్చినప్పుడు ఆయా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని తాసిల్దార్ హేమంత్ కుమార్ ను కోరారు. గ్రామంలోని ప్రజలు రైతులు ప్రతి ఒక్కరు ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ భూములు యొక్క హక్కులు పూర్తిస్థాయిలో పొందాలని అన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మారినేని మల్లికార్జున్, మల్లంపాటి కొండలరావు, రేషన్ డీలర్ మల్లంపాటి వంశీకృష్ణ, చుంచు మాలకొండయ్య మల్లంపాటి ప్రసాద్, బత్తిని అక్కమ్మ, బల్లాల శాంసన్, కాకి రవి, పత్రి కోటేశ్వరరావు, నూతలపాటి ప్రసన్న, వీఆర్వో మనోహర్, నారాయణ, సర్వే అసిస్టెంట్ నరేంద్ర రైతులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హేమంత్ కుమార్,యువనేత మారినేని రామకృష్ణ

## పల్లె సీమలో మెరిసిన ఆణిముత్యం

### ఎయిమ్స్లో 1400 ర్యాంక్ సాధించిన రైతు బిడ్డ తల్లపనేని వెంకట మంజునాథ్కు అభినందనల వెల్లువ..

**ఉదయగిరి/దుత్తలూరు(తెలుగోడు), జనవరి 3 :**
దుత్తలూరు మండలం నందిపాడు గ్రామ నివాసి తల్లపనేని సుబ్బారావు కుమారుడు వెంకట మంజునాథ్ ఆల్ ఇండియా ఎయిమ్స్లో 1400 ర్యాంకు సాధించి సత్తా చాడాడు. ఈ సందర్భంగా తలపునేని వెంకట మంజునాథ్ కు ఉదయగిరి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలుగుల్ల విజయలక్ష్మి , భారతీయ జనతా పార్టీ నెల్లూరు జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రి నాయుడు, బిజెపి సీనియర్ నాయకులు గడ్డం ప్రసాద్, మాజీ ఎంపీపీ శ్రీ కుర్తి రవీంద్రబాబు తదితరులు అభినందనలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ మన ప్రాంతవాసి తల్లపనేని మంజునాథ్ ఒక రైతు కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మమైన విద్యా సంస్థ ఎయిమ్స్ లో సీటు సాధించడం గొప్ప విషయం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మన్నేటి శ్రీనివాసులు రెడ్డి భారతీయ జనతా పార్టీ ఉదయగిరి, మాజీ మండల అధ్యక్షులు పి నారాయణ రెడ్డి, నందిపాడు గ్రామ ప్రజలు స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

## ప్రపంచ తెలుగు సభల్లో పాల్గొన్న అనంత కవులు

**అనంతపురం కల్చరల్(తెలుగోడు), జనవరి 3:**
ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గుంటూరు వేదికగా మూడు రోజులపాటు ఘనంగా సాగే తెలుగు ప్రపంచ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రస్థాయి ప్రముఖులు, అవధానులు, అధికారులు, రచయితల నడుమ కవి సమ్మేళనాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా అనంతపురం నుంచి సీనియర్ కవులు కృష్ణారెడ్డి, షరీఫ్, మురళీకృష్ణ, రామలింగమయ్య,షేక్ రియాజుద్దీన్ అహ్మద్, జెట్టి జయరాం తదితరులు కవితాగానం చేశారు. కవిత్వీకరణతో సాగిన కవితలు ఆహుతులను అలరించాయి. రమావతి, నీరజాచంద్రన్, సయ్యద్ నజ్మాషమ్మీ చేతులమీదుగా సన్మానం జరిగింది. జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు.

# పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

### జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ , రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచలబాబు యాదవ్

**ఉదయగిరి(తెలుగోడు), జనవరి 3 :**
ఉదయగిరి మండలం తిరుమలాపురం పంచాయతీ సచివాలయంలో పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ,మాజీ జెడ్పీ చైర్మన్ చంచల బాబు యాదవ్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక నేతలు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంచల బాబు యాదవ్ను శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదారుల పాస్ పుస్తకాలు రైతులకు ఒక వరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులకు పూర్తి హక్కులు కల్పించే విధంగా పాస్ పుస్తకాలను అందించారని అన్నారు.గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పాస్ పుస్తకాలపై ఆయన ఫోటో వేసుకొని కరపత్రముల తయారు చేశారని కానీ నేటి ప్రభుత్వం రాజముద్ర ముద్రించి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు రాష్ట్రానికి భారీగా పరిశ్రమలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అన్ని విధాల ముందుకు తీసుకెళ్తున్నారని స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి మండల టిడిపి అధ్యక్షులు సిహెచ్ బయన్న యాదవ్, అధ్యక్ష వహించారు.స్థానిక సర్పంచ్ కృష్ణ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ రియాజ్ మరియ నల్లి పోగురాజా రమణయ్య బొజ్జ నరసింహులు పెద్ద వెంకటయ్య మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు స్థానిక టిడిపి నాయకులు బాలిబోయిన రాజా యాదవ్ బొడ్డు పోయిన ప్రసాద్ యాదవ్ బాలిబోయిన చెన్నయ్య పంచాయతీ కార్యదర్శి రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పాసు పుస్తకాలు అందిస్తున్న జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ , రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచలబాబు యాదవ్



రైతులకు పాసు పుస్తకాలు అందిస్తున్న జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ , రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచలబాబు యాదవ్

# విజయ్ సేతుపతి రవింద్ స్వామిల కాంబో



భారతీయ చలనచిత్ర తెరపై దశాబ్దాల తర్వాత మళ్ళీ ఒక అద్భుత ప్రయోగం ఆవిష్కృతం కాబోతోంది. అప్పట్లో కమల్ హాసన్ నటించిన 'పుష్పక విమానం' వంటి మూకీ సినిమా ప్రేక్షకులను ఏ విధంగా మంత్రముగ్ధులను చేసిందో మనందరికీ తెలిసిందే. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత, అదే స్థాయిలో భావోద్వేగాలను పండించడానికి 'గాంధీ టాక్స్' అనే మూకీ డ్రామా సిద్ధమైంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించబోతున్నారు. ఈ సినిమాలో మాటలు లేకపోయినా, కేవలం నటీనటుల హావభావాలు మరియు సంగీతంతోనే కథను ప్రేక్షకుల హృదయాలకు చేరువ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు.ప్రముఖ నిర్మాణ సంస్థ 'జీ స్టూడియోస్' ఈ చిత్రాన్ని గాంధీజీ వర్థంతి సందర్భంగా జనవరి 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇది మూకీ సినిమా అయినప్పటికీ.. తెలుగు, తమిళం, హిందీ, మరాఠీ మరియు మలయాళ భాషల్లో టైటిల్ కార్డులు, ప్రమోషన్లతో గ్రాండ్‌గా విడుదల కానుంది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిలతో పాటు అందాల నటి అదితి రావు హైదరి, మరాఠీ నటుడు సిద్దార్థ్ జాదవ్ కీలక పాత్రల్లో నటించారు. మాటలు లేని ఈ సినిమాలో సంగీతమే ప్రాణం. అందుకే ఈ చిత్రానికి ఆస్కార్ విజేత, మ్యూజిక్ మాస్ట్రో ఏఆర్ రెహమాన్ అద్భుతమైన స్వరాలను అందిస్తున్నాడు. కిషోర్ పి. బేలేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఉమేష్ కుమార్ బన్సల్, రాజేష్ కేజ్రీవాల్, మీరా చోప్రా, కిషోర్ పాండురంగ్ బేలేకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# రజనీతో కమల్ మూవీ



అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించి బిగ్ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో రానున్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం యువ డైరెక్టర్ శిబి చక్రవర్తికి లభించింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది. 'ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది' అని రాసుకొచ్చింది. కమల్ సొంత నిర్మాణసంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.అంతకుముందు ఈ సినిమాకు సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. అయితే, అనుకోని కారణాల వల్ల దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ వైదొలిగారు. దీంతో కొత్త డైరెక్టర్ ఎవరై ఉంటారా? అని ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే రజనీని డైరెక్ట్ చేసే అవకాశం శిబి చక్రవర్తికి లభించింది. ఈ యువ దర్శకుడు 2022లో తీసిన డాన్ తమిళ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది.

# మన శంకర్‌వరప్రసాద్ పోస్టర్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నచిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో వరుసగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఇప్పటికే పాటలను విడుదల చేసిన చిత్రయూనిట్.. జనవరి 4న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు అమృతం ఫేమ్ హర్షవర్ధన్, హీరోయిన్ కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ, ఇప్పటికే కొత్త సినిమాలకు సంబంధించి పోస్టర్లు విడుదలయ్యాయి. ఆ పరంపర ఇంకా కొనసాగుతోంది. తాజాగా వివిధ సినిమాలకు సంబంధించి పోస్టర్లను ఆయా చిత్ర బృందాలు పంచుకున్నాయి. ఇందులో హర్షవర్ధన్, కేథరిన్, అభినవ గోమఠం తదితరులు చిరంజీవి వెనక నిలబడి ఉన్నారు. మరోవైపు ఓవర్సీస్‌లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. యూఎస్‌లో ఇప్పటికే 5వేలకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి. సినిమా విడుదలకు 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేయనున్నారు. జనవరి 3న రాజమహేంద్రవరంలో మొదలయ్యే ప్రచారం తిరుపతి, నెల్లూరు, విశాఖ, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, అనంతపురం, వరంగల్, బెంగళూరుల్లో జరగనుంది. వీటిలోని కొన్ని వేదికల్లో చిరంజీవి పాల్గొంటారని సమాచారం. తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దీని రన్‌టైమ్ 2 నిమిషాల 30 సెకన్లుగా అనిల్ రావిపూడి తెలిపారు.




# నటనపై ఆసక్తిలేదన్న అనీల్‌రావిపూడి



ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరోలు కావాలనుకుని ఇండస్ట్రీకి వచ్చి దర్శకులుగా స్థిరపడినవారు ఉన్నట్లే, దర్శకత్వ రంగంలోకి వచ్చి హీరోలుగా మారిన ఉదాహరణలూ ఉన్నాయి. నాని, రాజ్ తరుణ్ లాంటి వారు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పని చేసి తర్వాత హీరోలుగా సక్సెస్ సాధించారు. మరోవైపు కొందరు సక్సెస్‌ఫుల్ దర్శకులు కూడా హీరోగా మారాలని ప్రయత్నించి ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో టాలీవుడ్‌లో వరుస హిట్లతో దూసుకెళు న్న దర్శకుడు అనిల్ రావిపూడి హీరోగా మారతారా? అన్న ప్రశ్న తరచూ సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన స్టేజ్‌పై మాట్లాడే తీరు, కామెడీ టైమింగ్, మాస్ పల్స్ చూసి 'హీరో మెటీరియల్' అంటూ అభిమానులు కామెంట్స్ చేయడం కొత్త కాదు. అయితే ఈ విషయంపై అనిల్ రావిపూడి ఇచ్చిన సమాధానం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హీరోగా సినిమా చేయొచ్చుకదా అని అడిగినప్పుడు అనిల్ రావిపూడి చాలా మెచ్యూర్డ్‌గా స్పందించారు. మనమొక క్రాఫ్ట్‌లో టాప్‌లో ఉన్నప్పుడు పక్కదారి పట్టించడానికి ఇలాంటి ప్రలోభాలు వస్తాయి. వాటికి లొంగితే ఇప్పటికే ఉన్న కెరీర్‌కే ప్రమాదం. అందుకే ఆ ట్రాప్‌లో నేను పడను. నాకు హీరోగా మారాలనే ఉద్దేశం ఏమాత్రం లేదు. డైరెక్షన్‌పైనే పూర్తి దృష్టి పెడతాను అని ఆయన స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తుంది. టాలీవుడ్‌లో దర్శకుడు రాజమౌళి తర్వాత ఫెయిల్యూర్ లేని ట్రాక్ రికార్డ్ ఉన్న డైరెక్టర్‌గా అనిల్ రావిపూడికి మంచి పేరు ఉంది. ఆ రికార్డును కాపాడుకోవడమే తన ప్రధాన లక్ష్యమని, నటన వైపు వెళ్లి ఫోకస్ డైవర్ట్ చేయాలనే ఆలోచన తనకు లేదని ఆయన మరోసారి క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి పూర్తిగా మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాపైనే దృష్టి పెట్టారు.

# చైతన్య రావు దిల్ దియా పోస్టర్ విడుదల

కీడా కోలా, ఘాటి సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో చైతన్య రావు ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఆయన కథానాయకుడిగా దర్శకుడు కె. క్రాంతి మాధవ్ కాంబినేషన్‌లో ఒక నూతన చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకు 'దిల్ దియా' అనే టైటిల్‌ను ఖరారు చేయగా, 'ఏ నేక్డ్ ట్రూత్' అనేది ట్యాగ్ లైన్. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో చైతన్య సోఫాలో నగ్నంగా కూర్చోవడం చాలా విభిన్నంగా అనిపిస్తుంది. ఈ సినిమా థీమ్‌ను ప్రతిబింబించేలా ఫస్ట్ లుక్ ఉండటంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. చైతన్య రావు ఈ సినిమాలో గత చిత్రాల కంటే భిన్నమైన గెటప్‌లో కనిపిస్తుండటం విశేషం. శ్రీయాస్ చిత్రాస్, ఎ.పూర్ణ నాయుడు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై పూర్ణ నాయుడు ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. క్రాంతి మాధవ్ మార్క్ ఎమోషన్స్, చైతన్య రావు నటన ఈ సినిమాకు ప్రధాన బలం కానున్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ మరియు విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.